ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 14TH AUGUST 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 149 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 14 ఆగస్టు 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :149 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

- సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పీ.డీ.వో.లు నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13: ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# హెచ్చరిక లేబుళ్లపై కేంద్రానికి గడువు

## జంక్ ఫుడ్‌పై సుప్రీం హెచ్చరిక

- ప్రజారోగ్యమే ప్రధానమన్న ధర్మాసనం
- కార్పొరేట్ ఒత్తిడికి లొంగొద్దని వ్యాఖ్యలు
- రెండు వారాల్లో నిర్ణయం చెప్పాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 13 అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు కలిగిన ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్ల అమలులో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కీలక అంశంలో నిర్ణయాలు ఆలస్యం కావడం

➢ మిగతా 2వ పేజిలో..




## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం



- ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు.
- గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి

➢ మిగతా 2వ పేజిలో..




## భారత ప్రధాన న్యాయమూర్తి పట్ల అగౌరవం

- నల్సార్ విద్యార్థులకు బార్ కౌన్సిల్ షాక్
- న్యాయవాదులుగా నమోదు చేయకుండా ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్13 హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ విద్యార్థులకు సంబంధించి బార్ కౌన్సిల్

➢ మిగతా 2వ పేజిలో..



## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

- 119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల పంపిణీ
- ఆగస్టు 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారతే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఆగస్టు 13 బీసీ మహిళల ఆర్థిక స్వావలంబ నకు ఊతమిచ్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలుగా ఉండగా, లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అందజేయనున్నట్లు చెప్పారు. అర్హులైన బీసీ మహిళల నుంచి ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు

➢ మిగతా 2వ పేజిలో..

# పదేళ్ల బిఆర్ఎస్.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్

హైదరాబాద్,ఆగస్ట్13 పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తాన న్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది



➢ మిగతా 2వ పేజిలో..



## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా

న్యూఢిల్లీ,ఆగస్టు13 పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన

➢ మిగతా 2వ పేజిలో..



## ముఖ్యమంత్రి పర్యటనకు "ములుగు ముస్తాబు "

- మేడారంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- రూ.16 వేల కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు పైలాన్ ఆవిష్కరణ
- నూతన కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

➢ 2వ పేజిలో..

## తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్

న్యూఢిల్లీ,ఆగస్ట్13 తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెళినికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్

➢ మిగతా 2వ పేజిలో..

## పదేళ్ల బిఆర్ఎస్.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, దివ్యాంగులు, కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణ కూడా అందజేస్తామని తెలిపారు. మొదటి దశలో 1.19 లక్షల మంది మహిళలకు ప్రయోజనం కల్పించనున్నామని, భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.మహిళల ఉపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తోందని మంత్రి గుర్తుచేశారు. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం ద్వారా మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 14న మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ, ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

### ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## త్వరలో కోల్ ఎక్ఛేంజ్ ఏర్పాటు

### దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్టు13: దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిండర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

## ముఖ్యమంత్రి పర్యటనకు “ములుగు ముస్తాబు “

ములుగు, ఆగస్టు 13 రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని పరిశీలించేందుకు ఆమె జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని సందర్శించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. పైలాన్ నిర్మాణ పనుల్లో జాప్యానికి తావులేకుండా గుత్తేదారులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, వివిధ విభాగాలు, సమావేశ మందిరాలు, కార్యాలయ గదులను సందర్శించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, పార్కింగ్, రహదారులు వంటి మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించే విధంగా సముదాయాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా మేడారం చేరుకుని సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని మంత్రి సీతక్క తెలిపారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఆగస్టు 31 వరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని వెల్లడించారు.మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

### హెచ్చరిక లేబుళ్లపై కేంద్రానికి గడువు

ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ తమ తుది నిర్ణయాన్ని రెండు వారాల్లోగా వెల్లడించాలని ఆదేశించింది. నిర్ణయం తీసుకోకపోతే తామే తగిన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార ఉత్పత్తుల ప్యాకెట్ల ముందు భాగంలో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా హెచ్చరిక లేబుళ్లు ఉండాలనే డిమాండ్‌పై విచారణ జరిగింది. ముఖ్యంగా చిన్నారులు, యువత ఆరోగ్యంపై జంక్ ఫుడ్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించింది.విచారణ సందర్భంగా తయారీ సంస్థలు తమ వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా ఇటువంటి లేబుళ్లను వ్యతిరేకించవచ్చని, అయితే వినియోగదారులకు ఉత్పత్తిలోని పదార్థాల గురించి తెలుసుకునే హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము కొనుగోలు చేసే ఆహారంలో ఎంత ఉప్పు, చక్కెర, కొవ్వు ఉందో తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందని వ్యాఖ్యానించింది. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ వాదనలు కూడా విచారణలో చర్చకు వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలను పూర్తిగా అమలు చేస్తే నమ్‌కీన్ వంటి భారతీయ సంప్రదాయ ఆహార పదార్థాలపై కూడా హెచ్చరిక గుర్తులు పడే అవకాశం ఉందని ఆయన వాదించారు. అయితే ఈ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేస్తూ ఆరోగ్యపరమైన ప్రమాదాల విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొంది.ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇప్పటికే ఆహార ఉత్పత్తులపై ముందు భాగంలో హెచ్చరిక గుర్తులు తప్పనిసరి చేశాయి. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఉత్పత్తులను వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. భారతదేశంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తోంది. ప్రజారోగ్య సంస్థలు, వైద్య నిపుణులు కూడా దీనికి మద్దతు తెలుపుతున్నారు. రెండు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువులోగా నిర్ణయం రాకపోతే తదుపరి విచారణలో తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. దేశంలో పెరుగుతున్న ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి సమస్యల నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల ఆరోగ్య హక్కుల పరిరక్షణకు సంబంధించి సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## భారత ప్రధాన న్యాయమూర్తి పట్ల అగౌరవం

ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. 2026లో నల్సార్ నుంచి న్యాయ పట్టా పొందిన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లను బీసీఐ ఆదేశించింది. నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 2026లో పట్టా పొందనున్న విద్యార్థులతో పాటు ఇతర బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు కూడా ఈ అభ్యంతరాలకు మద్దతు తెలిపినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలకు సంబంధించి సీజేఐ చేసిన వ్యాఖ్యలే విద్యార్థుల అభ్యంతరాలకు కారణంగా నిలిచాయి. ఈ నేపథ్యంలో బీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది ల్సార్ యూనివర్సిటీ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు (అఏఎ ÷ాబీసాజీ ఐజీనిబి ఔంఒ÷ాంఖీ జనితిలIసబతిబా). అంతేకాకుండా, విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరసనకు సంబంధించి ప్రధానంగా ఎవరు ప్రచారాన్ని ప్రారంభించి, సమన్వయం చేశారో వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని నల్సార్ విశ్వవిద్యాలయాన్ని బీసీఐ కోరింది.

## తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో

భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

హైదరాబాద్,ఆగస్టు13 : రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ÷ర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) ఆగస్టు 13 అక్షరం న్యూస్:
రామగుండం-3 ఏరియా లోని సి.హెచ్.పి నందు డి.జి.యం గా విధులు నిర్వహిస్తూ రామగుండం-1 ఏరియా ఇంజినీర్ గా బదిలీ పై వెళ్తున్న కాశీ విశ్వేశ్వర రావు ను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం-3 ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ యం.రామ్మోహన్, వివిధ విభాగాల అధిపతులు గురువారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఉదయ భాస్కర్, విభాగాధిపతులు రాజా రెడ్డి, బి.టి.మురళీ కృష్ణ, సి.జె.సురేఖ, బి.సుదర్శనం, అప్సర్ పషా, రవిచరణ్, ఆసిఫ్ యాసిన్, ప్రకాష్ , మేఘన, డివై పియం వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అవగాహన సదస్సు..

- **తెలంగాణ లేబర్ కార్డు నమోదు శిబిరం**



శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజారక్షణ అక్షరం ప్రతినిధి ప్రజారక్షణ అంజయ్య నగర్ డివిజన్ వడ్డెర బస్తి, రాజీవ్ నగర్ కాలనీ, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి ప్రాంతాలలో వే ఫర్ లైఫ్ సంస్థ, హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ అమెజాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు, నమోదు శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పోస్ట్ ఆఫీస్ పథకాలు, ఆయుష్మాన్ భారత్ కార్డు, ఈ-శ్రమ్ తెలంగాణ లేబర్ కార్డు వంటి వివిధ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులకు అక్కడికక్కడే దరఖాస్తు నమోదు ప్రక్రియలో సహాయం అందించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. ప్రత్యేకంగా తెలంగాణ లేబర్ కార్డు నమోదు ప్రక్రియను నిర్వహిస్తూ, అసంఘటిత రంగ కార్మికులకు అందుబాటులో ఉన్న బీమా, విద్య, వైద్యం ఇతర సంక్షేమ ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అలకుంట తిరుపతి, దశరథ, పాండు, ఓలేపు శ్రీను, గ్రామ సభ్యులు స్వచ్ఛంద కార్యకర్తలు ప్రజలకుఅవసరమైన సహాయ సహకారాలు అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని నిర్వాహకులు హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ / అమెజాన్ వే ఫర్ లైఫ్ / అమెజాన్ సంస్థలు తెలిపారు.

## రామగిరి ఖిల్లాపై జెండా ఆవిష్కరణ

- **శ్రావణ మాసం తొలి రోజున నాగేపల్లి యువకుల సాహసోపేత కార్యక్రమం**



రామగిరి, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 13 (అక్షరం న్యూస్): శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా రామగిరి ఖిల్లాపై నాగేపల్లి గ్రామ యువకులు జెండాను ఆవిష్కరించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం తొలి రోజున ఎంతో కష్టతరమైన ఖిల్లా శిఖరాన్ని అధిరోహించి అక్కడి బండరాయిపై జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. తెలంగాణ ప్రాంతంలో విశిష్టమైన పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన రామగిరి ఖిల్లా రామగిరి మండలంలోని రత్నాపూర్, బేగంపేట పరిధిలో విస్తరించి ఉంది. శనివారం, సోమవారం రోజుల్లో భక్తుల సందడి నెలకొనడంతో పాటు ప్రతి ఏటా పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతోంది. శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన రామగిరి ఖిల్లా అద్భుతమైన కళా సంపదకు, నాటి శిల్పుల నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఖిల్లా పరిసరాల్లోని ప్రకృతి రమణీయ దృశ్యాలు, సెలయేటి గలగలలు, అబ్బురపరిచే శిల్ప కళాఖండాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకులను మరింతగా ఆకర్షించడంతో పాటు రామగిరి ఖిల్లా విశిష్టతను చాటిచెప్పేందుకు నాగేపల్లి గ్రామం ఏ-బ్లాక్‌కు చెందిన పందుల రాము ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈయనతో పాటుగా రత్నాపూర్ గ్రామంలోని సంజీవనగర్‌కు చెందిన కండే సుబ్బు, బెజ్జాల మహేష్ లు ఖిల్లా శిఖరంపైకి చేరుకుని జెండాను ఆవిష్కరించారు. శ్రావణ మాసం తొలి రోజున ఖిల్లాపై జెండా ఆవిష్కరణ కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# సైబర్ నేరాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలి




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రామగుండం ఏరియా-1 సైబర్ నేరాల విభాగం సూచించింది. సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే 2, 2ఏ ఇంక్లైన్‌లోని జీడీకే 2 సెక్షన్‌లో గురువారం 'సురక్షిత్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్‌కుమార్ ఆదేశాల మేరకు, సైబర్ నేరాల విభాగం ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మారుతి సైబర్ నేరాల తీరుతెన్నులు, వాటి నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ మోసం జరిగిన విషయం ఎంత త్వరగా తెలియజేస్తే అంత త్వరగా సంబంధిత ఖాతాలను నిలిపివేసే అవకాశం ఉంటుందని, ఆలస్యం చేస్తే నగదు తిరిగి పొందడం కష్టమవుతుందని తెలిపారు. వాట్సాప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులు, దర్యాప్తు సంస్థల పేరుతో బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తే భయపడవద్దని సూచించారు. అలాంటి కాల్స్‌ను వెంటనే నిలిపివేసి సమీపంలోని సైబర్ నేరాల విభాగానికి సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, అనుమానాస్పద అనువర్తనాలు, ఏపీకే ఫైళ్లను తెరవకుండా వెంటనే తొలగించాలని సూచించారు. ఫోన్‌కు వచ్చే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిలో వన్‌టైమ్ పాస్‌వర్డ్ నమోదు చేయవద్దని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, వన్‌టైమ్ పాస్‌వర్డ్‌లు, పాన్, ఆధార్ వివరాలతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. పెట్టుబడుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గని మేనేజర్ ఇజ్జగిరి శివయ్య, సంక్షేమ అధికారి డి. గణేష్, సెక్షన్ ఇన్‌చార్జి సల్మాన్‌ఖాన్, వెంటిలేషన్ అధికారి జి. కుమారస్వామి, గని అధికారులు, పిట్ కార్యదర్శి పొన్నాల వెంకటయ్య, పర్యవేక్షకులు, మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సంగ్రామంలో మసీదు ల చారిత్రక పాత్ర

- **ఐక్యతకు, త్యాగానికి సజీవ సాక్ష్యాలు.**

పెద్దపల్లి జిల్లా / సుల్తానాబాద్ / ఆగస్టు 13 /అక్షరం న్యూస్ ప్రతినిధి.
(మహమ్మద్ యూసుఫ్ అలీ)

మన దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మసీదులు కేవలం మతపరమైన ప్రార్థనా మందిరాలు గానే కాకుండా, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన విప్లవాలకు, సామాజిక చైతన్యానికి, మత సామరస్యానికి ముఖ్య కేంద్రాలుగా అత్యంత కీలకమైన పాత్రను పోషించాయి. దేశవిముక్తి కోసం సాగిన సుదీర్ఘ పోరాటం లో ప్రాంతీయ హద్దులు, మత వ్యత్యాసాలను దాటి విప్లవకారులను, సామాన్య ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఇవి ప్రధాన భూమిక వహించాయి. బ్రిటిష్ పాలనలో కఠినమైన సెన్సార్‌షిప్, విప్లవకారుల సమావేశాలపై తీవ్రమైన నిషేధాలు ఉన్న సమయంలో మసీదులు సురక్షితమైన రహస్య సమావేశ వేదికలుగా మారాయి. ప్రతి శుక్రవారం జరిగే ప్రార్థనల సందర్భంగా వేలాది మంది ప్రజలు సహజంగానే ఒకే చోట చేరే అవకాశం లభించేది. దీనిని స్వాతంత్ర్య సమరయోధులు అనుకూలంగా మలచుకుని, వార్తలను విస్తృతంగా చేరవేయడానికి, బ్రిటీష్ వ్యతిరేక కరపత్రాలను పంపిణీ చేయడానికి, నిరసనలకు ప్రణాళికలు సిద్ధం చేయడానికి ఉపయోగించుకునేవారు. ప్రత్యేకించి 1857 మొదటి స్వాతంత్ర్య సంగ్రామం సమయంలో ఢిల్లీలోని జామా మసీదు, ఫతేపురి మసీదులు విప్లవకారులకు ప్రధాన వ్యూహాత్మక కేంద్రాలుగా మారాయి. సైనికులు, సామాన్య ప్రజలు ఇక్కడ సమావేశమై బ్రిటీష్ వారిని గద్దె దించేందుకు తీవ్రమైన పోరాట వ్యూహాలు రచించారు. ఈ పోరాటంలో మసీదులు చూపిన మరొక మహత్తరమైన కోణం హిందూ-ముస్లిం ఐక్యత. వలస పాలకులు అమలు చేసిన 'విభజించు-పాలించు' సూత్రానికి వ్యతిరేకంగా జాతీయ ఐక్యతను చాటడానికి ఇవి వేదికలయ్యాయి. 1919లో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతమైన సమయంలో, ఆర్యసమాజ్ నాయకుడైన స్వామి శ్రద్ధానంద్ ఢిల్లీలోని చారిత్రాత్మక జామా మసీదు మింబర్ పైకి ఆహ్వానించారు. అక్కడ నుంచి ఆయన వేలాది మంది ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించారు. వేద మంత్రాలతో ప్రారంభమైన ఆ ప్రసంగానికి ప్రతిస్పందనగా వేలాది మంది 'ఆమీన్' అని పలకడం భారత స్వాతంత్ర్య చరిత్రలోనే ఒక అరుదైన, అద్భుతమైన ఐక్యతా ఘట్టంగా నిలిచిపోయింది. ఆ తరువాత కాలంలో సాగిన ఖిలాఫత్, సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాల సమయంలో మహాత్మా గాంధీ, పండిత్ జవాహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి అగ్ర నాయకులు మసీదుల మైదానాల నుంచే ప్రజలను ఉద్దేశించి ప్రసంగించి స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. మసీదులు విప్లవానికి, ప్రతిఘటనకు స్థావరాలుగా మారాయని గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం వాటిపై తీవ్రమైన కక్షసాధింపు చర్యలకు దిగింది. 1857 తిరుగుబాటును అణచివేసిన తరువాత, ఢిల్లీని తిరిగి స్వాధీనం చేసుకున్న బ్రిటిష్ సైన్యం జామా మసీదును తమ అధీనంలోకి తీసుకుని, దానిని గుర్రాల లాయంగా, మిలిటరీ బ్యారక్‌గా మార్చింది. దాదాపు ఐదు సంవత్సరాల పాటు అక్కడ ప్రార్థనలను పూర్తిగా నిషేధించారు. మరోవైపు, లక్నోలోని ఆసఫీ మసీదు బెగం హజ్రత్ మహల్ నాయకత్వంలో బ్రిటిష్ వారిపై తిరుగుబాటుకు ముఖద్వారంగా నిలవగా, కోల్‌కతాలోని నాఖోడా మసీదు బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలో, స్వదేశీ ప్రచారంలో కీలక పాత్ర పోషించింది. కేరళలోని




చేరమాన్ జుమా మసీదు మలబార్ తీరంలో సాగిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలకు మద్దతుగా నిలిచింది. ఇటువంటి చైతన్యాన్ని అణచివేయడానికి బ్రిటిష్ పాలకులు కొన్ని మసీదులను ధ్వంసం చేయడం, ఫతేపురి మసీదు వంటి వాటిని వ్యాపారులకు వేలం వేయడం వంటి దారుణమైన చర్యలకు పూనుకున్నారు. భారత స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ మసీదులు కేవలం ఆరాధనా స్థలాలుగా మాత్రమే కాకుండా రాజకీయ చైతన్యానికి, విప్లవ ఆలోచనలకు, మాతృభూమి విముక్తితో పాటు భిన్నత్వంలో ఏకత్వానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. స్వాతంత్ర్య సాధన కోసం దేశప్రజలందరినీ ఐక్యం చేయడంలో ఇవి పోషించిన చారిత్రాత్మక పాత్ర భారత జాతీయోద్యమ చరిత్రలో సదా చిరస్మరణీయంగా నిలిచిపోయింది. స్వాతంత్ర్యం సిద్ధించి శతాబ్ది దిశగా పయనిస్తున్న భారతదేశంలో, నాటి పోరాటాల్లో మైనారిటీల భాగస్వామ్యాన్ని, మసీదుల వ్యూహాత్మక పాత్రను గుర్తుచేసుకోవడం కేవలం చరిత్ర పునరావృతం కాదు. అది నేటి సమాజానికి అత్యంత అత్యవసరమైన ఐక్యతా సందేశం. ఏ సైద్ధాంతిక వైరుధ్యాలు, విద్వేష ప్రచారాలు చెరిపివేయలేని ఆ త్యాగాల బాటలో నడవడం, ఆ అమరవీరుల బలిదానాలకు శిరస్సు వంచి నివాళులర్పించడం మన అందరి బాధ్యత.

# ఎన్టిపిసి రామగుండంలో దేశభక్తి చాటిన వందేమాతరం గానం






జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
: భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎన్‌టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో సెయింట్ క్లేర్ పాఠశాలలో గురువారం ఘనంగా సామూహిక వందేమాతరం గానం, వందేమాతరం ఆకృతి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీపీసీ రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత హాజరయ్యారు. పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 1,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్‌టీపీసీ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కలిసి మైదానంలో 'వందేమాతరం' అక్షరాల ఆకృతిని అద్భుతంగా రూపొందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు కలిసి దేశభక్తి భావాన్ని చాటుతూ సామూహికంగా వందేమాతరం గానం చేశారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని గుర్తుచేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఐక్యత, దేశభక్తి, జాతీయ గర్వాన్ని ప్రతిబింబించింది. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలనే స్ఫూర్తిని ఈ కార్యక్రమం కలిగించింది. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ పాటిల్ ఈజీఎం హెచ్‌ఆర్ సాగర్ రంజాన్ సాహూ ప్రవీణ్ కుమార్ చౌదరి అధికారుల సంఘం అధ్యక్షులు నితీష్ కుమార్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ కార్యదర్శి నవనీత్ రాథోడ్ గుర్తింపు యూనియన్ బిఎమ్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి కార్యదర్శి సాగర్ రాజు చల్ల సత్యనారాయణ రెడ్డి జ్యోతిక కార్యదర్శి రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రామగుండం రైల్వే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



జ్యోతినగర్, ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం రైల్వే కాలనీలోని గృహ నిర్వహణ విభాగంలో 15, 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను అమలు చేయాలని కోరుతూ కార్మిక సంఘం నాయకులు కేంద్ర సహాయ కార్మిక కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2025 మే నెలలో సింగూరు నాగేశ్వర్‌రావు కాంట్రాక్టు పనులు చేపట్టిన సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటికీ ఆ హామీ అమలు కావడం లేదని నాయకులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం నైపుణ్యం అవసరం లేని కార్మికులకు నెలకు రూ. 14,456 వేతనం చెల్లించాల్సి ఉండగా, భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం మినహాయింపుల అనంతరం రూ. 12,613 చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ప్రస్తుతం కేవలం రూ. 9,000 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించేలా సంబంధిత కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర సహాయ కార్మిక కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. రామాచారి, సలహాదారు ఎన్. బిక్షపతి, కోశాధికారి కె. తిరుపతి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు గురువారం రామగుండం తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, జీవో 25ను సవరించాలని కోరారు. 2003లో నియమితులైన ఉపాధ్యాయులకు జీవో 57ను అమలు చేయడంతో పాటు రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీంను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంప్లాయి హెల్త్ స్కీంకు సంబంధించిన విధివిధానాలను వెంటనే రూపొందించి హెల్త్ కార్డులను జారీ చేయాలని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించే వరకు నెలకు రూ. 2 వేల కోట్లను విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ, డీటీఎఫ్ నాయకులు సుదర్శన్ రెడ్డి, కిరణ్ కుమార్, ఉమామహేశ్వర్, రమేష్, వసుంధర, ప్రమీల, చంద్రశేఖర్, స్నేహలత, లావణ్య, లక్ష్మణ్ కుమార్, ప్రశాంత్, దేవికతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దివంగత హోంగార్డ్ లక్ష్మణ్ కుటుంబానికి ఆర్థిక సాయం

- మానవత్వం చాటుకున్న సహచర హోంగార్డులు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి ఆగస్టు 13/ అక్షరం న్యూస్ –:

మందమర్రి మండలంలోని?రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం చెందిన హోంగార్డ్ లక్ష్మణ్ కుటుంబాన్ని రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా హోంగార్డులు మరియు పోలీస్ లు అండగా నిలిచారు. దివంగత లక్ష్మణ్ 11వ రోజు (పదకొండవ రోజు) సస్మరణ/కర్మకాండల సందర్భంగా మందమర్రిలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హోంగార్డులందరూ కలిసి సేకరించిన 48,000/- (నలభై ఎనిమిది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని దివంగత లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు అందజేసి తమ ఉదారతను, సహచర ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మరియు బాధ్యులు మాట్లాడుతూ:"హోంగార్డు వ్యవస్థలో పనిచేస్తున్న ఒక సహచర ఉద్యోగికి కష్టం వస్తే అందరం కలిసికట్టుగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం కమిషనరేట్ ఆర్.ఐ పెద్దయ్య, ఏ.ఆర్.ఎస్.ఐ రామ్ సింగ్ హోంగార్డ్ లు సురేష్,శ్రావణ్, రాజన్న, సదానందం, తిరుపతి, లక్ష్మణ్, మహేష్ లతో పాటు జిల్లాకు చెందిన హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ పంపిణీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా , ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఆమోఘమని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ , ఔట్ సోర్స్ కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కార్యాలయంలో ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తమ పాలక వర్గం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం నుండి వారికి అందవల్సిన ప్రయోజనాలను సకాలంలో వచ్చేట్టు చూస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులు , రెండు తువ్వాలలు సుమారు 400 మంది సిబ్బందికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ , సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్ , జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో విద్యార్థులతో దేశభక్తి ర్యాలీ







జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామంలో మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం లిహర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్నిలి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ పతాకాలను అందజేసి, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లికందుల సంధ్యారాణిలి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, యువత దేశ సేవలో ముందుండాలని ఆమె అన్నారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతి రాణి అధ్యాపకులు మరియు బిజెపి నాయకులు గోపు రామన్న, మేడం రాజు, శంకరయ్య ,మేడం మల్లయ్య, చల్ల హరీష్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందిగా మారిన హోల్‌సేల్ కూరగాయల మార్కెట్





- మేదర్‌బస్తి మార్కెట్‌కు వెంటనే తరలించాలని డీవైఎఫ్ఐ డిమాండ్

జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను వెంటనే మేదర్‌బస్తి కూరగాయల మార్కెట్‌కు తరలించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ డిమాండ్ చేశారు. మార్కెట్ కారణంగా కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. వేసవి కాలంలో మేదర్‌బస్తి కూరగాయల మార్కెట్‌లోని హోల్‌సేల్ వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తాత్కాలికంగా ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో మార్కెట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే మేదర్‌బస్తిలో మార్కెట్ నిర్మాణాలు పూర్తయినప్పటికీ హోల్‌సేల్ మార్కెట్‌ను అక్కడికి తరలించకపోవడం వల్ల కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు కొనసాగుతున్నాయని అన్నారు. మార్కెట్‌కు వచ్చే ద్విచక్ర వాహనాలు, డీసీఎం వ్యాన్లు, ఇతర వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ఉదయం ప్రార్థనా సమయం, విద్యార్థుల సమావేశాలకు ఆటంకం కలుగుతోందన్నారు. మరోవైపు సాయంత్రం వేళల్లో మద్యం దుకాణం పరిసరాల కారణంగా కళాశాల మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ఆరోపించారు. ఈ ప్రాంతం గుండా వెళ్లే మహిళలు, బస్టాప్‌లో వేచి ఉండే వారు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. కళాశాల మైదానంలో కనిపిస్తున్న మద్యం సీసాలే పరిస్థితికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుమతులు ఎవరు ఇచ్చారో అధికారులు స్పష్టం చేయాలని కొంటు సాగర్ డిమాండ్ చేశారు. కళాశాల స్థలానికి సంబంధించిన పటాన్ని ప్రజలకు బహిర్గతం చేయడంతో పాటు, దుకాణాల సముదాయానికి విద్యాశాఖ నుంచి పొందిన ఉత్తర్వుల ప్రతులను కూడా వెల్లడించాలని కోరారు. నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి కళాశాల స్థలాన్ని పరిరక్షించాలని మున్సిపల్, సింగరేణి, సంబంధిత శాఖల అధికారులను కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

## సోమూర్ గ్రామంలో హర్ గర్ తిరంగా ర్యాలీ నిర్వహణ

మద్నూర్ / ఆగస్టు 13 ( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం సోమూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో హర్ గర్ మే తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. గురువారం రోజున బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు తుకారాం గ్రామ సర్పంచ్ సంగ్రామ్ ఉప సర్పంచ్ రమేష్, గ్రామ ప్రజలు చేతులో జాతీయ జెండాలు పట్టుకొని హర్ గర్ మే తిరంగా అనే అంశాలను తెలియజేశారు. స్వతంత్ర దినోత్సవం ఆగస్టు 15 రోజు సందర్భంగా ప్రతి ఒక్కరు జాతీయ జెండాలను ప్రతి ఇంట్లో స్వచ్ఛందంగా పెట్టుకొని దేశ భక్తిని చాటుకోవాలని కోరారు.



## పెద్దపల్లి జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక



జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీరదాస్ వెంకటరత్నం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గోదావరిఖని దుర్గా నగర్‌లోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా జూపాక వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఆసంపల్లి రవీందర్, గడ్డం సునీల్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దూడపాక లింగస్వామి, గజ్జల ప్రసన్న, భీమారపు సంపత్, కోయిల సాగర్, అధికార ప్రతినిధిగా ఇరువురాల మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మాజీ బార్ కౌన్సిల్ సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది బైరపాక జయకర్, కొండపర్తి కృష్ణ, మైదానం జైపాల్‌తో పాటు జిల్లా న్యాయవాదులు గొర్రె రమేష్, ఇరికిల నరసయ్య, వెలుగుటూరి శోభారాణి, పులిపాక ప్రవీణ్, పెద్దెల్లి ప్రకాష్, పెర మనోహర్, కాదేశి శేఖర్, ఇరుగు రాళ్ల సంతోష్, గాజుల రాజకుమార్, బొల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరయ్యారు.

## ఆపదలో ధైర్యసాహసాలు.. బాలిక ప్రాణాలు కాపాడిన యువకులకు సన్మానం

- **గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ అభినందనలు**




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

బొక్కలవాగులో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతున్న బాలికను ధైర్యసాహసాలతో రక్షించిన బోయినిపేటకు చెందిన అంకం శేఖర్, ఆకుల అరవింద్‌లను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తన కార్యాలయంలో అభినందించి సన్మానించారు.మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలవాగు వద్ద బోయినిపేటకు చెందిన పర్శవేన రాజు తన కుమార్తె అలేఖ్యతో కలిసి గొర్రెల మందను వాగు దాటించే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో జారిపడ్డాడు.తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించిన అలేఖ్య కూడా నీటిలో మునిగిపోతూ కేకలు వేసింది.అదే సమయంలో అటుగా వెళ్తున్న అంకం శేఖర్ వెంటనే స్పందించి నీటిలోకి దిగి అలేఖ్యను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోవడంతో శేఖర్, ఆకుల అరవింద్ కలిసి ప్రథమ చికిత్స అందించి ఆమెను స్పృహలోకి తీసుకువచ్చారు. అనంతరం అలేఖ్య తన తండ్రి కూడా నీటిలో మునిగిపోయినట్లు చెప్పడంతో ఇద్దరూ వాగులోకి దిగి రాజును బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఆపద సమయంలో ప్రాణాలకు తెగించి బాలికను కాపాడటంతో పాటు ఆమె తండ్రిని రక్షించేందుకు ప్రయత్నించిన శేఖర్, అరవింద్‌ల ధైర్యసాహసాలను ఏసీపీ ఎం.రమేష్ అభినందించారు. ఏసీపీ కార్యాలయంలో మంథని సీఐ బుద్దె స్వామి,ఎస్ఐ సాగర్‌ల సమక్షంలో వారిని శాలువాలతో సత్కరించి,ఆపదలో మానవత్వంతో స్పందించినందుకు అభినందనలు తెలిపారు.ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు సమయస్ఫూర్తితో స్పందించడం అభినందనీయమని, వారి ధైర్యసాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని ఏసీపీ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రికి నూతన అంబులెన్స్ ప్రారంభం






- **అత్యవసర వైద్య సేవలకు మరింత ఊతం: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఎన్‌టీపీసీ సామాజిక బాధ్యత నిధులతో సమకూర్చిన నూతన అంబులెన్స్‌ను రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి నూతన అంబులెన్స్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఎన్ టీ వీ సీ సామాజిక బాధ్యత నిధులతో అంబులెన్స్‌ను సమకూర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, అత్యవసర సేవలను మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేస్తామని చెప్పారు.నూతన అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులను వేగంగా ఆస్పత్రికి తరలించడంతో పాటు, మెరుగైన వైద్యం కోసం అవసరమైన సందర్భాల్లో ఇతర ఆస్పత్రులకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే స్వయంగా అంబులెన్స్‌ను నడిపి సందడి చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు, ఆస్పత్రి అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్‌టీపీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మంచిర్యాల జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్న హర్కర వేణుగోపాల్ రావు



జ్యోతి నగర్ ఎన్టిపిసి, ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వారీగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులను ప్రభుత్వం నియమించింది.ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జి.ఓ.ఆర్.టి. నెం.1177, తేదీ 12-08-2026 ప్రకారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించనున్నారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను ఉద్దేశించి హర్కర వేణుగోపాల్ రావు ప్రసంగించనున్నారు.దేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, జాతీయ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపడుతోంది..

## చనిపోయినా.. చిరంజీవులుగా!

- **అవయవదానానికి జూపాక దంపతుల సంకల్పం**
- **సమాజానికి స్ఫూర్తిదాయక నిర్ణయం**




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

మనిషి జీవితానికి అసలైన అర్థం.. తాను లేనప్పటికీ మరొకరి జీవితంలో కొనసాగడమే. ఇదే స్ఫూర్తితో ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగులు జూపాక దేవమణి--కొమురయ్య దంపతులు మరణానంతరం తమ అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. గురువారం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా వారు తీసుకున్న ఈ నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలిచింది. లయన్స్ క్లబ్ ఆఫ్ జ్యోతినగర్ ప్రగతి (డిస్ట్రిక్ట్ 320+) ఆధ్వర్యంలో, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి కె.వాసు సహకారంతో సాయి సేవా సమితి ప్రాంగణంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రీజియన్--ఫోర్, జోన్ త్రీ చైర్‌పర్సన్ లయన్ కొమురవెల్లి సుధాకర్, ఎం జె ఎఫ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో దేవమణి--కొమురయ్య దంపతులు అవయవదాన ప్రతిజ్ఞ పత్రాలపై సంతకాలు చేశారు.

### మరణం తర్వాతా.. మనిషిగా మిగిలే అవకాశం...

తమ మరణం అనంతరం అవయవాలను దానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారికి కొత్త జీవితాన్ని అందించవచ్చనే ఉద్దేశంతో దంపతులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి సంకల్పాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించి సత్కరించారు.

అవయవదానం కేవలం ఒక దానం కాదని.. ఒక కుటుంబానికి ఆశను, ఒక వ్యక్తికి జీవితాన్ని అందించే మహోన్నత మానవతా కార్యక్రమమని నిర్వాహకులు పేర్కొన్నారు. సమాజంలో మరింత మంది అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జ్యోతినగర్ ప్రగతి అధ్యక్షుడు లయన్ దొండపాటి మహేందర్ రెడ్డి, కార్యదర్శి లయన్ మెట్పల్లి అనిల్ రావు, కోశాధికారి లయన్ ధర్ని పోచంలతో పాటు క్లబ్ ప్రతినిధులు కోదాటి ప్రవీణ్, కొమురవెల్లి రాహుల్, కొమురవెల్లి అరుణ, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల గంగాధర్, వినీల, వైష్ణవి, సైనీత, మల్లేశ్వరి, వేణు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. “జీవించి ఉన్నప్పుడు మన జీవితం మన కోసం.. మరణించిన తర్వాత మన అవయవాలు మరొకరి కోసం. అవయవదానం చేద్దాం.. మరొకరికి పునర్జన్మ ప్రసాదిద్దాం.” అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జమ్మికుంట తాసిల్దారు ఆఫీస్ వద్ద ధర్నా

- **తహశీల్దార్ కి వినతిపత్రం అందజేత**




కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 13/అక్షరం న్యూస్:

ఆల్ మండల్ హమాలి యూనియన్ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో తాశీల్దారు ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం వినతి పత్రం తహశీల్దార్ సుధాకర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ పాల్గొని మాట్లాడుతూ హమాలి కార్మికులు అనేక సంవత్సరాల నుండి ఎగుమతులు దిగుమతులు చేస్తూ పనిచేస్తున్నారు. కానీ వారికి ఎలాంటి బెనిఫిట్స్ ప్రభుత్వం నుండి రావడశీ లేదు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు 8 నెలలు గడుస్తున్నది. ఎన్నికల మేనిఫెస్టోలో హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి సమస్యలు పరిష్కరించలేదు. ఈ క్రింది సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

హమాలి కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలి. ప్రభుత్వం చే 55 సంవత్సరాలు కార్మికుల అందరికీ, ప్రతి ఒక్కరికి రూ.6000 పింఛను ఇవ్వాలి. ఇండ్లు లేని హమాలీ కార్మికుల అందరికీ ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి 120 గజాల స్థలంలో ఇల్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలి. ప్రభుత్వం నేరుగా గుర్తింపు కార్డులు అందించాలి.ప్రమాదంలో మరణించిన హమాలీ కార్మికులకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి.

ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో హామాలి సంఘం నాయకులు జక్కుల రమేష్ యాదవ్, రావుల ఓదే లు, కొంద్ర క్రాంతి, మారపల్లి కిరణ్,పుట్టపాక రాజేందర్, సంతోష్, సుమన్ శ్రీనివాస్,ప్రవీణ్, సురేష్ శివ బండితదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు వివాహ రిసిప్షన్ పత్రికలు అందజేత



మద్నూర్ / ఆగస్టు 13( అక్షరం న్యూస్ - కామారెడ్డి )

జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావు కూతురు వివాహ రిసిప్షన్ కార్డులను జర్నలిస్టులకు ఆహ్వాహన పత్రికలు అందించడం జరిగిందని మండల జర్నలిస్టు అధ్యక్షుడు సందూర్ వార్ హన్మాండ్లు తెలిపారు. గురువారం రోజున మద్నూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి గోపి జర్నలిస్టు కమిటీ సభ్యులకు పత్రికలు అందించి ప్రతి ఒక్కరు రిసిప్షన్ కు హాజరు కావాలని కోరారు. మండల జర్నలిస్టులకు వివాహ రిసిప్షన్ ఆహ్వానం కొరకు ప్రత్యకంగా తెలపడం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టు మండల అధ్యక్షుడు సందూర్ వార్ హన్మాండ్లు, ఉపాధ్యక్షుడు శివాజీ అప్ప, క్యాషియర్ నాగేష్ గౌడ్ పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగుల వైద్య సమస్యల పరిష్కారానికి చర్యలు



జ్యోతినగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఎన్టిపిసి రేవా కార్యనిర్వాహక సభ్యులు గురువారం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఐ.ఆర్. లహరిని కలిసి పదవీ విరమణ పొందిన వైద్య కార్డు దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ ఐ.ఆర్. లహరిని అభినందించి సన్మానించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పదవీ విరమణ చేసిన వైద్య కార్డు దారులకు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులను అందించడం, బాహ్య రోగుల విభాగంలో ఆసుపత్రి ఆవరణలోనే హోమియోపతి మందులు అందుబాటులో ఉంచడం, అత్యవసర పరిస్థితుల్లో ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో అంబులెన్స్ సేవలు అందించడం వంటి అంశాలను కార్యనిర్వాహక సభ్యులు సిఎంఓ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యలపై డాక్టర్ ఐ.ఆర్. లహరి సానుకూలంగా స్పందిస్తూ, పదవీ విరమణ అనంతరం వైద్య కార్డు దారులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో అధ్యక్షుడు ఆకుల రామకిషన్, కార్యదర్శి చెప్యాల శ్రీపతిరావు, రేవా సీనియర్ నాయకులు డాక్టర్ దుర్గం నర్సయ్య, మంగళంపల్లి రామ్ నారాయణ, హర్కర వేణుగోపాల్ రెడ్డి, జూపాక కొమురయ్య, కొమ్ము గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తులు చేపించిన తహసీల్దార్ రంజిత్ కుమార్



మద్నూర్ / ఆగస్టు 13 (అక్షరం న్యూస్ - కామారెడ్డి )

డోంగ్లీ మండల కేంద్రంలోని గ్రామంలో ఉన్నటువంటి ప్రధాన రహదారికి గుంతలు ఏర్పడంతో రెవిన్యూ శాఖ సిబ్బంది తహసీల్దార్ రంజిత్ కుమార్ రోడ్డు పనులు మరమ్మత్తులు చేపించడం జరిగింది. గురువారం రోజున ప్రయాణికులకు, ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులకు గుంతలు, రోడ్డు పై వర్షపు నీరు, మురికి కాలువ నీరు రోడ్డు పై ఆగడం తో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటం తో ప్రయాణికీలు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తహసీల్దార్ రంజిత్ కుమార్ గ్రహించి కాంక్రిట్ మిక్సర్ మీశ్రమం ఒక టిప్పర్ లోడ్డు తెపించి గుంతలను గుంతలను పూడ్చడం జరిగింది. గుంతలపై కాంక్రిట్ మిక్సర్ మీశ్రమాన్ని వేయడం తో రోడ్డుకు నూతన మహర్దషా ఏర్పడటం జరిగింది. ప్రధాన రహదారిగా ఉన్నా ఈ రోడ్డు మరమ్మత్తులు చేపట్టడం తో ఉమ్మడి మండలాల ప్రజలు రెవిన్యూ శాఖ సిబ్బంది యొక్క ప్రజా సేవా కు ప్రజలు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. స్వయంగా తహసీల్దార్ రంజిత్ కుమార్, ఆర్. ఐ. సాయి బాబా దగ్గరగా ఉండి ఉన్నటువంటి గుంతలను కార్మికుల ద్వారా పూడ్చివేయడం జరిగింది. ఈ గుంతలు పూడ్చడం మూలంగా నీరు నిలువ ఉండకుండా రహదారి మంచిగా కావడం తో ప్రయాణికుల ఇబ్బంది వాహనదారుల యొక్క కష్టాలు తొలిగిపోతాయాని గ్రామస్తులు పెరకున్నారు. రోడ్డు మరమ్మత్తులు చేసి రోడ్డు బాగా చేయడం తో గ్రామస్థులు తహసీల్దార్ రంజిత్ కుమార్ యొక్క సేవాలను కొనియాడుతున్నారు. ఈ మార్గం గుండా అనేక వాహనదారులు, బస్సులు బీర్కూర్, బాన్సు వాడ, బోధన్ కు నిరంతరం ప్రయాణికులు వెళ్తుంటారు. . ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంజిత్ కుమార్, ఆర్. ఐ. సాయిబాబా, గ్రామా నాయకులు విలాస్ పటేల్, పంచాయతీ కార్యదర్శి సవాయి సింగ్, వార్డు సభ్యుడు రమాకాంత్, ఉన్నారు.

# ఆదర్శ పాఠశాల విద్యార్థుల మాక్ ఎలక్షన్ ద్వారా కమిటీ ఎన్నిక





మద్నూర్ / ఆగస్టు 13 (అక్షరం న్యూస్ - కామారెడ్డి )

మద్నూర్ మండలం మెనూర్ గ్రామంలో ఉన్నటువంటి ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల కమిటీ ( మాక్ ఎలక్షన్ ) ఎన్నికల ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవడం జరిగిందని ప్రిన్సిపాల్ నర్సా గౌడ్ తెలిపారు. గురువారం రోజున ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ఎన్నిక కమిటీ నిర్వహణ లో మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, గ్రామ సర్పంచ్ అశోక్ పటేల్, పంచాయతీ సెక్రెటరీ హరీష్ ఎన్నికల విధానాన్ని పర్శిలించారు. తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ పాఠశాల విద్య స్థాయి నుంచి విద్యార్థులు తమ యొక్క ఓటు హక్కు (మాక్ ఎలక్షన్ ) తో మంచి నాయకులను ఎన్నుకునే అలవాటు ఏర్పడుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికి తీయడంతో పాటు,వారికి ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు, బాధ్యతలు, క్రమశిక్షణ వంటి ఆదర్శ లక్షణాలను చిన్నతనం నుంచి పెంపొందిస్తాయి. నాయకుడంటే ఎలా ఉండాలి అని, ఎవరు సమస్యలను పట్టించుకుంటారని తెలియజేస్తూ, నాయకుడికి కలుపుగోలుతనం ఎలా ఉండాలని, ఓటరు ప్రక్రియకి సంబంధించిన విషయాలను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి అయిన ఎమ్మార్వో ముజీబుద్దీన్ గారు వివరించడం జరిగింది. ఇలాంటి అద్భుత విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడం వల్ల వారు భవిష్యత్తులో మంచి నాయకత్వానికి పునాదివేసి, సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలగడంతో పాటు వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ సర్పంచ్ అయినా అశోక్ పటేల్ గారు తెలియజేశారు. ఈ ఎన్నికల ప్రక్రియ భాగంగా హెడ్ 4 గ్రూపుల ద్వారా గెలుపొందిన వారు 1) పాఠశాల హెడ్ బాయ్ - హరీష్ గౌడ్, 2) పాఠశాల హెడ్ గర్ల్స్ గా సమీక్షా, 3) డిప్యూటీ హెడ్ బాయ్ గా సిద్దార్థ్, డిప్యూటీ హేడ్ గర్ల్స్ గా మయూరి అనే అభ్యర్థులు గెలుపొందటం జరిగిందని ప్రిన్సిపాల్ నర్సా గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు మారోతి, జైనాలోద్దీన్ ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూఎస్పీసీ ఆధ్వర్యంలో నిరసన





- ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి...
- యూఎస్పిసి రాష్ట్ర నాయకులు అటుకుల శ్రీనివాస్ రెడ్డి..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 13/అక్షరం న్యూస్:-

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ విద్యారంగ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేసి. ముఖ్యమంత్రికి పంపించాలని కోరారు.

ఈ సందర్భంగా యూఎస్పీసీ రాష్ట్ర నాయకుడు అటుకుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోరాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు 29న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దోరి రమేష్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.రాజేంద్రం, డీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రవీందర్, మాడుగుల నవీన్‌కుమార్, టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భిక్షపతి, కె.కొమురయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సమ్మయ్య, జి.ప్రదీప్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎ.మోహన్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్‌టీపీసీ మేధా ప్రతియోగిత జాతీయ ఫైనల్ పోటీలు




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 13 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధా ప్రతియోగిత--2026 జాతీయ ఫైనల్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. నోయిడాలోని ఎన్‌టీపీసీ పవర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ పోటీల్లో జూనియర్, మధ్య, సీనియర్, ఉద్యోగుల విభాగాల్లో మొత్తం 24 జట్లు పోటీపడ్డాయి.ఎన్‌టీపీసీ ప్రాజెక్టులు, ప్రాంతాల నుంచి మొత్తం 1,863 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. జూలై 12న యూనిట్, ప్రాజెక్టు స్థాయిలో రాత పరీక్షతో పోటీలు ప్రారంభమయ్యాయి. అనంతరం కోర్బా, రామగుండం, తాల్చేర్ కనిహ, నబీనగర్, దాద్రి, నోయిడాల్లో ప్రాంతీయ స్థాయి పోటీలు నిర్వహించి జాతీయ ఫైనల్‌కు జట్లను ఎంపిక చేశారు.జూనియర్ విభాగంలో పశ్చిమ ప్రాంతానికి చెందిన అహాన్, దేవయాంశ్ సింగ్ జట్టు విజేతగా నిలిచింది. మధ్య విభాగంలో ఉత్తర ప్రాంతానికి చెందిన ఉత్కర్ష్ పారిఖ్, దర్ష్ జైన్, సీనియర్ విభాగంలో ఉత్తర ప్రాంతానికి చెందిన తన్మయ్ వర్మ, హర్షిత్ శర్మ విజయం సాధించారు. ఉద్యోగుల విభాగంలో పశ్చిమ ప్రాంతానికి చెందిన అన్నుమాన్ శ్రీవాస్తవ్, శుభమ్ మిశ్రా జట్టు విజేతగా నిలిచింది.విజేతలైన ప్రతి జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎన్‌టీపీసీ డైరెక్టర్ (మానవ వనరులు) అనిల్ కుమార్ జాడ్లీ విజేతలకు బహుమతులు అందజేశారు.ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో అభ్యసన సంస్కృతిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు మేధా ప్రతియోగితను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు.

## సమ సమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటాలు

- ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్చార్జి ఏపూరి వెంకటేశ్వర్లు..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 13/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు విద్యాభారతి పాఠశాలలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాదిగ సంక్షేమ పోరాట సమితి అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో మండలస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాట్ల వెంకటస్వామి మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ మాదిగ సంక్షేమ పోరాట సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడుతూ మత దురహంకారం కుల వివక్ష సామాజిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.బండారి సురేందర్ మాదిగ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు మాదిగలు, పేద వర్గాల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి పలు సంక్షేమ పథకాల సాధనకు కృషి చేసిందని తెలిపారు. కుల వివక్ష సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ విభాగాల కమిటీలు రద్దయిన నేపథ్యంలో అన్ని గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంస్థాగతంగా పునర్నిర్మాణం చేయాలని నాయకులు సూచించారు. విద్యార్థులు, యువతను ఉద్యమంలోకి తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పనిచేసే శక్తివంతమైన ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.మహనీయుల ఆశయాల సాధన పీడిత వర్గాల విముక్తి కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి కృషి చేయాలని కోరారు. అన్ని గ్రామాలు, మండలాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండాల కుమార్, ఐలెపాక స్వామి, సమితి సీనియర్ నాయకులు స్వామి, శిఖ సురేష్, పారినందుల మహేందర్, మాడుగుల ప్రభుదాస్, వేల్పుల ప్రశాంత్, పోర్నందుల సురేష్, నాగిల్ల చందర్, మంగళపల్లి దిలీప్, కాదాస్ ప్రవీణ్, గజ్జల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చదువుల బడిలో చిరునవ్వులు.. విద్యార్థులకు ఉచిత బూట్లు పంపిణీ చేసిన సర్పంచ్ ఆదిలక్ష్మి



ఆరోగ్యం, క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / ములకలపల్లి /ఆగస్టు 13 / అక్షరం న్యూస్ –:

మండలంలోని మూకమామిడి గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టగూడెం ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత బూట్లను సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పిల్లలందరూ శుభ్రంగా, క్రమశిక్షణతో పాఠశాలకు రావాలని, చదువుతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న ఉచిత బూట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. బద్రు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఏటా విద్యార్థులకు యూనిఫామ్, బూట్లు, పుస్తకాలు ఉచితంగా అందిస్తోందని, దీనివల్ల పేద తల్లిదండ్రులకు ఆర్థిక భారం చాలావరకు తగ్గుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. బద్రు, ఉపాధ్యాయులు బి. లక్ష్మణ్, ఎ. శ్రీను, కె. రాంబాబు, జి. కృష్ణ, వాడే రామచంద్రం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకం ద్వారా బూట్లు అందుకున్న విద్యార్థులు ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ఘనంగా ‘హర్ ఘూర్ తిరంగ’ ర్యాలీ

- దేశభక్తి నినాదాలతో మార్మోగిన ములకలపల్లి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి / ఆగస్టు 13 / అక్షరం న్యూస్ –:

మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గుగులోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో హర్ ఘూర్ తిరంగ యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం – ప్రతి హృదయంలో దేశభక్తి అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, మహిళలు మరియు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో కదిలివచ్చారు. చేతిలో జాతీయ జెండాలతో నిర్వహించిన తిరంగా ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగుతూ ప్రజల్లో జాతీయ భావాలను ఉప్పొంగించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గుగులోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. స్వరాజ్య సంపాదన కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి భారతీయుడూ నిత్యం స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా మువర్ణాల జెండాను ఎగరేసి దేశ సమైక్యతను చాటాలని ఆయన ఆకాంక్షించారు. యువత మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాలుపంచుకోవడంతో ములకలపల్లి కేంద్రమంతా దేశభక్తి గీతాలు, నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పాలకుర్తి ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గొడ్ల రాజు, భానోత్ మల్లేష్, గుగులోత్ జేతు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## ములకలపల్లి వాడే వెంకటేష్ పార్థివ దేహానికి సర్పంచ్ కుంజా వినోద్ నివాళులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /ఆగస్టు 13/ అక్షరం న్యూస్ –:

ములకలపల్లి మండలం జగన్నాథపురం పంచాయతీ పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ ఆకస్మిక మృతి చెందడంతో, గ్రామ ప్రజలు మరియు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, వెంకటేష్ పార్థివ దేహాన్ని దర్శించుకుని వారి కుటుంబ సభ్యులకు స్థానిక సర్పంచ్ కుంజా వినోద్ మరియు వార్డు సభ్యుడు పద్దం నాగరాజు ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దహన సంస్కారాల నిమిత్తం రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో పెద్ద మనసుతో ఆదుకున్న ప్రజాప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు స్థానిక నాయకులు రామాచారి, బొడ్డప్ప, గుంటూరు సాయిరామ్, సున్నం నాగేష్, ఊకె కృష్ణ, నాగేష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# ఏడాది నిండని పసికందులాంటి కార్పొరేషన్ ను చిదిమేయకండి


- కొత్తగూడెం కార్పొరేషన్ ‘అర్బన్ ఛాలెంజ్ ఫండ్’కు అర్హత సాధించిపెట్టా.
- డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం.
- విమర్శల నివృత్తికే ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశం.
- రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అబద్ధం.
- అబద్దపు ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు సృష్టించొద్దు.
- అవినీతి అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు.
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 13 / అక్షరం న్యూస్ –: అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నిధులు వెచ్చించి పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఆయా పనులకు సంబంధించిన డిపిఆర్ తయారీ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు మంజూరు కానున్నాయని, పనుల అంచనాల ప్రకారమే కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర వాటా మరియు బ్యాంకుల రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా లక్ష కోట్ల కేంద్ర సహాయంతోపాటు 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని, ఇందులో భాగమైన 26 మున్సిపాలిటీల్లో ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.2,670 కోట్ల రుణం వస్తుండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600 కోట్ల రుణం అడిగామని వివరించారు. అభివృద్ధి పనుల నిధులపై కాకుండా కేవలం ‘వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక టెండర్’కు సంబంధించి కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని మండిపడ్డారు. రూ.600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డిపిఆర్ టెండర్ ఒప్పందం కుదిరితే, అందులో ఏకంగా రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ.1,000 కోట్ల పనులకు 1.5 శాతంతో ఇలాగే డిపిఆర్ ఒప్పందాలు కుదిరాయని గుర్తుచేశారు. ఇతర పట్టణాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానంలో టెండర్లు జారీ అయినప్పుడు లేని అవినీతి కేవలం కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని, అక్కడ కూడా అవినీతి జరిగినట్లేనా అని నిలదీశారు. ఆరు నెలల పసిపిల్ల లాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చంపాలని కుట్రలు చేస్తున్నారని, అసలు నిధులే విడుదల కాకుండా డిపిఆర్ ఫీజులో కోట్ల రూపాయల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో అపోహలు సృష్టించారని, ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేయడానికి ఆఫ్‌లైన్ డిపిఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. డిపిఆర్ శాతాన్ని 0.5 శాతానికి లేదా మరింత తగ్గించే సామర్థ్యం ఉన్నవారు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లు

_గా సీపీఐ అధీనంలోనే ఉందని, ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలుస్తామా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణం (టీఎండీపీ) విధానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని, అనవసర ఆరోపణలు చేస్తే వెంటాడతామని హెచ్చరించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరావు, మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, గడ్డం శాంతిప్రియ, గడ్డం వెంకటేశ్వర్రావు, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, ధనలక్ష్మి, దుర్గయ్య, కళావతి, శ్యామల, మంద నాగమణి, మద్దాల హరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట మున్సిపాలిటీలో డీజిల్ గోల్‌మాల్!







- ప్రైవేటు వాహనం పేరుతో నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- రూ.60--70 వేల డీజిల్ బిల్లుల వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట /ఆగస్టు 13/అక్షరం న్యూస్ :–పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన అశ్వారావుపేటలో డీజిల్ వినియోగానికి సంబంధించిన లెక్కలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మున్సిపాలిటీ ఏర్పడిన కొద్దికాలానికే డీజిల్ బిల్లుల వ్యవహారంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తడం కలకలం రేపుతోంది.

### ప్రైవేటు వాహనం పేరుతో బిల్లులా?

మున్సిపాలిటీకి సంబంధం లేని ఓ ప్రైవేటు ఇసుక ట్రాక్టర్ పేరుతో డీజిల్ బిల్లులు నమోదు చేసి, ఆ మొత్తాన్ని మున్సిపాలిటీ ఖాతాల్లో చూపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే నెలలో సుమారు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు డీజిల్ ఖర్చు చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ లెక్కల్లో తేడాలు రావడంతో సంబంధిత మొత్తాన్ని సూపర్‌వైజర్లే భరించాలంటూ ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

### రిజిస్టర్లలో వివరాలపై అనుమానాలు

వ్యవహారంపై అనుమానాలు వ్యక్తం కావడంతో మీడియా ప్రతినిధులు సంబంధిత పెట్రోల్ బంక్ రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న నెలకు సంబంధించిన రిజిస్టర్లలో వివరాలు నమోదు చేసినప్పటికీ, గత నెలల రికార్డుల్లో మాత్రం తేదీ, రుసుము వంటి వివరాలు మాత్రమే ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ వాహనం వచ్చిందన్న బండి నంబర్, ఎన్ని లీటర్ల డీజిల్ పోశారన్న వివరాలు సక్రమంగా నమోదు కాలేదని చెబుతున్నారు.

ప్రజా ధనంతో నిర్వహించే మున్సిపల్ వాహనాల డీజిల్ వినియోగానికి సంబంధించి వాహన నంబర్, తేదీ, సమయం, లీటర్ల పరిమాణం తదితర వివరాలు స్పష్టంగా ఉండాల్సిన నేపథ్యంలో రికార్డుల్లో కనిపిస్తున్న వ్యత్యాసాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఆధారాలు చూపాలని కోరుతున్న మీడియా

ఈ ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్‌ను విలేకరులు వివరణ కోరగా, ఎలాంటి కుంభకోణం జరగలేదని, మున్సిపాలిటీ వద్ద రికార్డులు భద్రంగా ఉన్నాయని తెలిపినట్లు సమాచారం. అయితే లాగ్‌బుక్స్, డీజిల్ రసీదులు, ఇతర సంబంధిత ఆధారాలను చూపించాలని కోరినప్పుడు సమాధానాలు స్పష్టంగా లేవని మీడియా ప్రతినిధులు పేర్కొంటున్నారు.

లాగ్‌బుక్స్ కార్యాలయంలో అందుబాటులో లేవని, సంబంధిత సూపర్‌వైజర్లు విధుల్లో ఉన్నారని, వారు వచ్చిన తర్వాత వివరాలు చెబుతానని కమిషనర్ పేర్కొన్నట్లు సమాచారం. దీంతో రికార్డుల నిర్వహణపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### సమగ్ర విచారణకు డిమాండ్

మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి డీజిల్ కొనుగోళ్లు, వాహనాల వినియోగం, లాగ్‌బుక్స్, పెట్రోల్ బంక్ రిజిస్టర్లు, చెల్లించిన బిల్లులను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒక్క నెలకు సంబంధించిన వ్యవహారంలోనే ఇలాంటి ఆరోపణలు వెలువడితే, గత నెలల రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే మరిన్ని లెక్కలు వెలుగులోకి వస్తాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందా? లేక సిబ్బంది స్థాయిలోనే అవకతవకలు జరిగాయా? అన్నది సమగ్ర విచారణతో తేలాల్సి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అశ్వారావుపేట మున్సిపాలిటీ డీజిల్ కొనుగోళ్లు, లాగ్‌బుక్స్, పెట్రోల్ బంక్ రికార్డులు, బిల్లులు, నిధుల వినియోగంపై ప్రత్యేక విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.

## బొప్పాయి ఆకుల రసాన్ని సేవిస్తే నిజంగానే ప్లేట్‌లెట్లు పెరుగుతాయా.. అధ్యయనాలు ఏం చెబుతున్నాయి..?

వర్షాకాలంలో డెంగీ కేసులు పెరుగుతుండటంతో ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవడానికి ఏం చేయాలనే అంశంపై చాలామందిలో ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా బొప్పాయి ఆకుల రసం ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచుతుందనే నమ్మకం చాలాకాలంగా ఉంది. దీనిపై కొన్ని పరిశోధనలు కూడా జరిగాయి. అయితే బొప్పాయి ఆకులు డెంగీకు చికిత్సగా పనిచేస్తాయా, వాటిని ఎలా ఉపయోగించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను తెలుసుకోవడం ముఖ్యం. డెంగీ సోకినప్పుడు రక్తంలోని ప్లేట్‌లెట్ కౌంట్ వేగంగా తగ్గడం ఒక ముఖ్యమైన సమస్యగా మారుతుంది. దీన్ని థ్రాంబోసైటోపీనియా అంటారు. ప్లేట్‌లెట్ కౌంట్‌ను వైద్యుల సూచన మేరకు నిరంతరం పర్యవేక్షించడం అవసరం. ఈ కారణంగానే కొంతమంది డెంగీ రోగులకు ఆసుపత్రిలో చికిత్స అవసరమవుతుంది. బొప్పాయి ఆకులను, ముఖ్యంగా కారికా పపాయా ఆకుల ఎక్స్‌ట్రాక్ట్‌ను, డెంగీ సమయంలో ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచేందుకు సంప్రదాయంగా ఉపయోగిస్తున్నారు. బొప్పాయి ఆకుల్లోని కొన్ని పదార్థాలు రక్తంలోని ప్లేట్‌లెట్ల ఉత్పత్తికి సంబంధించిన ప్రక్రియలకు సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అలోక్స్ 12, పీటీఏఎఫ్ఆర్ వంటి జన్యువులు ప్లేట్‌లెట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు పేర్కొన్నాయి.

### అనేక బయో యాక్టివ్ సమ్మేళనాలు..



బొప్పాయి ఆకుల్లో కార్పైన్, ఫ్లేవనాయిడ్లు, క్వెర్సెటిన్, కెంప్ఫెరోల్, క్లోరోజెనిక్ యాసిడ్, పపైన్, కైమోపపైన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉన్న పదార్థాలుగా ఉన్నాయి. అలాగే బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్‌లో రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడంలో సహాయపడే కొన్ని లక్షణాలు ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. డెంగీ రోగుల్లో బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్ ప్రభావంపై బీఎంసీ కాంప్లిమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, ప్లస్ వన్ వంటి జర్నల్స్‌లో పరిశోధనలు ప్రచురితమయ్యాయి. కొన్ని అధ్యయనాల్లో బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్ తీసుకున్నవారిలో రక్తంలోని ప్లేట్‌లెట్ కౌంట్ 50,000/బూ కంటే ఎక్కువగా పెరిగే అవకాశం కనిపించింది. అయితే ఈ పరిశోధనలు పరిమిత సంఖ్యలో డెంగీ రోగులపై జరిగాయి. అందువల్ల బొప్పాయి ఆకులు డెంగీ రోగులందరిలోనూ ప్లేట్‌లెట్ కౌంట్‌ను కచ్చితంగా పెంచుతాయని నిర్ధారించడానికి మరింత విస్తృతమైన పరిశోధనలు అవసరం. బొప్పాయి ఆకుల రసం శరీరంలో సులభంగా శోషణకు గురవుతుందని, ప్లేట్‌లెట్ కౌంట్ పెరగడానికి సహాయపడుతుంని నిపుణులు చెబుతున్నారు. అయితే ఎంత పరిమాణంలో, ఎప్పుడు తీసుకోవాలనే విషయంలో జాగ్రత్త అవసరం. అంతేకాకుండా బొప్పాయి ఆకుల రసం చాలా చేదుగా ఉండటం వల్ల కొంతమందికి దాన్ని తట్టుకోవడం కష్టంగా ఉంటుంది.

## శంకర్‌పల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- మన త్రివర్ణ పతాకం దేశభక్తి స్ఫూర్తికి ప్రతీక: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి : ఆగష్టు 13: అక్షరం న్యూస్ –: మన త్రివర్ణ పతాకం, మన జాతీయ గౌరవానికి ఐక్యతకు, దేశభక్తి స్ఫూర్తికి ప్రతీక అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం అన్నారు. ఈ సందర్భంగా గురువారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని కన్వీనర్ బి. వీరేందర్, కో కన్వీనర్ ఆర్ వెంకట్ రాంరెడ్డి ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద, చైతన్య, జాగృతి కళాశాలల విద్యార్థిని, విద్యార్థులతో బిజెపి నాయకులు కలిసి గెస్ట్ హౌస్ నుండి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా జాతీయ జెండాలతో వందేమాతరం నినాదాలతో ప్రధాన చౌరస్తా వద్ద ముగిసింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన ఎందరో అమరవీరులను, స్వాతంత్ర్య సమరయోధులను గౌరవంగా స్మరించుకోవాలని గుర్తు చేశారు. చివరిగా అందరూ కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుడు బసగళ్ల రాములు గౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, పరమేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ, సురేష్, నరసింహారెడ్డి, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఖమ్మం పట్టణములోఘనంగా తిరంగా ర్యాలీ..



ఖమ్మం జిల్లా/తల్లాడ టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించిన తిరంగా ర్యాలీలో భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ నాయకులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి , రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి , బద్దం మహిపాల్ రెడ్డి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటుతూ నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. అనంతరం భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు సుధాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, ఆత్మీయంగా మాట్లాడారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, అఖండ భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ తిరంగా ర్యాలీ ద్వారా చాటిచెప్పడం జరిగిందని తెలిపారు.

## ఫోటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీ..

- రాష్ట్ర ప్రభుత్వం ఫోటోగ్రాఫర్ల సంక్షేమ పథకాలు అందించాలి. ..
- ఫోటోగ్రాఫర్ జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు మారగాని వెంకట్..



ఖమ్మం జిల్లా వైరా టౌన్ ఆగస్టు 13 ( అక్షం న్యూస్)

వైరా మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బట్ట కృష్ణ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, రాష్ట్ర నాయకుడు దేవర నాగరాజు చేతుల మీదుగా గండగలపాడు సాయిబాబా ఆలయం లో నూతన కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, రాష్ట్ర నాయకుడు దేవర నాగరాజు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, యూనియన్ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఫోటోగ్రాఫర్లకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ఇళ్ల నిర్మాణం కోసం రుణ సదుపాయం కల్పించాలని కోరారు. రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో కుటుంబ భరోసా పథకాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి ఫోటోగ్రాఫర్ భరోసా పథకంలో సభ్యులుగా చేరాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బట్ట కృష్ణయ్య ప్రధాన కార్యదర్శి కాకటి వినోద్ కుమార్ కోశాధికారి తేలపుట్ట ప్రసన్న, ఈ కార్యక్రమం అనంతరం అధ్యక్షులకు ఘన సన్మానం చేశారు. గౌరవ అధ్యక్షులు ఏపూరి రాజారావు జిల్లా నాయకులు ఎక్కిరాల శ్రీనివాసరావు, కుటుంబ భరోసా ఇన్చార్జ్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు,ప్రవీణ్ నాగేశ్వరరావు రవి, శీను గొడ్ల ప్రశాంత్, తడికమల్ల వెంకటేశ్వర్లు. దావీదు, ప్రేమ్ కుమార్ కిషోర్ ఆనంద్, అక్రమ్.రాజు ఉదయ్ అనిల్ హరి సతీష్ నాగ, అన్వేష్ సాయి అక్రమ్ రవి ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# జేబీపీ పోరాటంతో డీపీఆర్ టెండర్ రద్దు

- టెండర్ రద్దుతో చేతులు దులుపుకోవడం కాదు..
- అవినీతి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి.
- ప్రజా పోరాటాలకు ఎవరైనా తలవంచాల్సిందే.
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్.




భద్రాద్రి కొత్తగూడెం / పాల్వంచ / ఆగస్టు 13 / అక్షరం న్యూస్ –: కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరంతర ప్రజా పోరాటానికి మరోసారి విజయం లభించిందని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. జైభీమ్ రావ్ భారత్ పార్టీ పోరాటం నేపథ్యంలో డీపీఆర్ టెండర్‌ను రద్దు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పాల్వంచ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ..ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, పారదర్శకతకు తావులేకుండా వ్యవహరిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై న్యాయబద్ధంగా, నిరంతరం పోరాటం చేస్తే చివరకు అధికార యంత్రాంగం కూడా ప్రజల డిమాండ్లకు తలవంచాల్సిందేనని అన్నారు.

“డీపీఆర్ టెండర్ రద్దు చేయడంతో సమస్య పూర్తయినట్లు అధికారులు భావించకూడదని” టెండర్ ప్రక్రియలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం “టెండర్ రద్దు చేసి చేతులు దులుపుకోవడం ప్రజలను మోసం చేయడమే” అని యెర్రా కామేష్ వ్యాఖ్యానించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే ఏ ప్రయత్నాన్నైనా జైభీమ్ రావ్ భారత్ పార్టీ అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు. టెండర్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని, నిబంధనలను ఉల్లంఘించిన అధికారుల పాత్రపై విచారణ జరిపించాలని ఇప్పటికే డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్తె తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ కు పిర్యాదు చేయడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై జేబీపీ పోరాటం ఇక్కడితో ఆగదని యెర్రా కామేష్ తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు, ప్రజా నిధుల దుర్వినియోగంపై పార్టీ నిరంతరం నిఘా ఉంచుతుందని అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం కొనసాగుతుంది” అని యెర్రా కామేష్ స్పష్టం చేశారు. డీపీఆర్ టెండర్ రద్దు ప్రజా పోరాటానికి వచ్చిన ప్రాథమిక విజయమేనని, అయితే అసలు బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, పాల్వంచ, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు నిట్టా నర్సింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి





- **పోలీస్ కమిషనర్**

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి, విక్రయదారులు, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటూనే, వినియోగదారులకు సరఫరా మార్గాలను అడ్డుకోవడం సాధ్యమవుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.నేర సమీక్షాసమావేశం గురువారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ....సమాజంలో డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టి బాధితులను సాధారణ జీవితంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయడం చాలా ముఖ్యమని అన్నారు. పాఠశాలలు, కాలేజీలలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.సమాజిక మాధ్యమాల అతిగా వాడకం వల్ల పిల్లలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని, ఇన్‌స్టాగ్రామ్,వాట్సాప్, ఫేస్‌బుక్, గేమింగ్ యాప్‌ల ద్వారా నేరగాళ్లు మైనర్ పిల్లలతో స్నేహం చేస్తున్నారని, పిల్లలను ప్రేమ పేరుతో నమ్మించి, లోబరుచుకుని లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. వ్యక్తిగత ఫోటోలు సేకరించి వాటిని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనివల్ల పోక్సో కేసు ఫిర్యాదులు సైతం పెరుగుతున్నాయని అన్నారు.పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని అన్నారు.జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని, వాహనదారులు వేగ పరిమితులు పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరిని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.చోరీ సొత్తు రికవరీ కేసులలో దర్యాప్తు వేగవంతం చేయడానికి సాంకేతికతను, ప్రత్యేక బృందాలను ఉపయోగించాలని, అదేవిదంగా రాత్రి గస్తీని పెంచడం, సీసీ కెమెరాల నిఘా, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, సారంగపాణి,నరసింహారావు, మహేష్, సాంబరాజు, సత్యనారాయణ, సర్వర్, శ్రీనివాసులు



# తల్లాడ మండలంలోని ప్రభుత్వ స్థానిక పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం ..



- **బ్రేక్ఫాస్ట్ ను కార్యక్రమాన్ని ప్రారంభించిన.. గ్రామ సర్పంచ్లు**

ఖమ్మం జిల్లా/ తల్లాడ టౌన్ ఆగస్టు 13 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలంలోని ప్రభుత్వ స్థానిక సంస్థలపాఠశాలలన్నింటిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు హరే కృష్ణ ఫౌండేషన్ వారి



సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అల్పాహార బ్రేక్ఫాస్టు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమాన్నిఆయాపాఠశాలలప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు మరియు కమిటీ సభ్యులసమన్వయంతో ప్రారంభించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, శారీరక మరియు మానసిక వికాసానికి తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ రోజు నుంచి ప్రతిరోజూ ఉదయం 8:00 గంటలకు వైరా మండలంలోని అన్ని ప్రభుత్వ స్థానిక సంస్థల



పాఠశాలలకు అల్పాహారం సరఫరా చేయడం



జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఎంఈఓ దామోదర్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులందరూ ఈ



అల్పాహార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమం విజయవంతంగా



అమలు కావడానికి సహకరిస్తున్న గ్రామ సర్పంచులు, అమ్మ ఆదర్శపాఠశాలకమిటీలు,ఉపాధ్యాయులు మరియు హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు కూడా ఇవ్వాల్సిందే..!

- బీజేపీ నాయకులు మట్ట పవన్ రెడ్డి



కరీంనగర్/ఇల్లందకుంట/ ఆగస్టు 13 /అక్షరం న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన 420 హామీలలో భాగంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లను కూడా వెంటనే అమలు చేయాలని ఇల్లందకుంట మండల బీజేపీ నాయకులు మట్ట పవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పెన్షన్లను పెంచి ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ రెండున్నరేళ్లు గడిచినా పెన్షన్ల పెంపుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా ప్రజలను మభ్యపెడుతోందని పవన్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకటించిన నేపథ్యంలో మీ-సేవ కేంద్రాలకు వెళ్లిన వృద్ధులు, బీడీ కార్మికులకు సంబంధించి దరఖాస్తు చేసుకునే ఆప్షన్ సైట్‌లో కనిపించడం లేదని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో కూడా వృద్ధాప్య, బీడీ కార్మికుల వివరాల నమోదు కోసం ప్రత్యేకంగా ఎలాంటి కాలమ్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారా? లేదా? సైట్‌లో ఆప్షన్ కనిపించకపోవడానికి ఏమైనా సాంకేతిక సమస్య ఉందా? అనే విషయాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని మట్ట పవన్ రెడ్డి డిమాండ్ చేశారు.అలాగే ఆగస్టు 15 నుంచి పెన్షన్లను పెంచి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, వృద్ధులు, బీడీ కార్మికులకు కూడా పెంచిన పెన్షన్‌ను అందించాలని కోరారు. హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## 13వ వార్డులో చారిత్రక ప్రాధాన్యం

- గుట్టబడిలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన...
- 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయ సీతారాములు

ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - హరేకృష్ణ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి.ఈ సందర్భంగా మున్సిపాలిటీ తొలి వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ మంచి పోషక విలువలతో కూడిన మెనూను విద్యార్థిని విద్యార్థులకు అందించటం ద్వారా విద్యార్థుల శారీరక, మానసిక వికాసాన్ని అభివృద్ధి చేయటం రాష్ట్ర ప్రభుత్వ సదుద్దేశం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాసచారి సీనియర్ ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్రరావు ,వి. శైలజ జి..వాసు కే. లక్ష్మి యాస కృష్ణకుమారి షేక్. సల్మా సుల్తానా తేజవత్ దీప, మొగలాబి వాణిశ్రీ తల్లితండ్రులు రాంబాబు శ్రీనివాసరావు పుల్లయ్య తదితరులు పాల్గొని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధను వహిస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఖిలాషాపురం పీఎం శ్రీ పాఠశాలలో బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ ప్రారంభం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) ఆగస్టు13: మండలంలోని ఖిలాషాపురం పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెడ్‌మాస్టర్ భారత రవీందర్ ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా ఆదేశాల మేరకు జీసీడీవో గౌసియా బేగం పర్యవేక్షణలో విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ శిక్షణ అందిస్తున్నారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల ప్రవాహరి గోడకు కన్నెం



మద్నూర్ / ఆగస్టు 13 (అక్షరం న్యూస్ - కామారెడ్డి )

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మెనూర్ గ్రామంలోని ఆదర్శ మోడల్ పాఠశాల ప్రవహరి గోడకు పెద్ద రంధ్రం దర్శనమివ్వడం జరుగుతుంది. వ్యవసాయ పనులకు వెళ్లే వారందరు సందేహాలు, అనుమానాలు పడుతున్నారు. ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి నుండి ఇంటర్ వరకు విద్యార్థినిలకు హాస్టల్ వసతి కలిగి ఉండటం పాఠశాల వెనుక వైపు ప్రహరీ గోడ ఎవరో కావాలిచ్చి పెద్ద రంధ్రాన్ని ఏర్పార్చడం తో అక్కడ నుండి వెళ్లే వాళ్లకు అనుమానాలు వ్యక్తమావడం జరుగుతుంది. అసలు ప్రవాహరి గోడకు పెద్ద మనుషులు లోపల వెళ్లే విధంగా గోడ రంధ్రంగా ఏర్పార్చారు. పాఠశాల విద్యార్థిని?యులకు రక్షణ లేకుండా ఉన్నదా లేకుంటే పాఠశాలలో ఉన్నటువంటి సరుకులను రాత్రి పూట బయటకు తీసుకోవెళ్ళడానికి గోడకు రంధ్రాన్ని ఎవరన్నా ఏర్పార్చారా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఆదర్శ పాఠశాల వెనుక భాగం గుట్టలు వ్యవసాయా క్షేత్రం కావడం తో రాత్రి పూట అసాంఘిక కార్యక్రపాలు జరుగుతున్నాయా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఏది ఏమైనా తక్షణమే ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవాహరి గోడ రంధ్రాన్ని తక్షణమే పర్శిలించి ప్రవాహరి గోడ మరమ్మత్తులు పాఠశాల నలు వైపులా సీసీ క్యాంరాలు ఏర్పర్చి హాస్టల్ విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోర్తున్నారు.



# పౌష్టికారంతో విద్యార్థుల శారీరక మానసిక అభివృద్ధి..





- వైరా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

ఖమ్మం జిల్లా/వైరా టౌన్ ఆగస్టు 13 (అక్షరం న్యూస్)

విద్యార్థుల శారీరిక , మానసిక అభివృద్ధి కొరకు పౌష్టికాహారం చాలా ఉపయోగపడుతుందని ,వైరా పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి డాక్టర్ కాపా చంద్రకళ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఈరోజు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి నవీనజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాబోయే భావి భారత పౌరుల శారీరక ,మానసిక అభివృద్ధి కొరకు అనేక పథకాలు ప్రారంభిస్తుందని ,ఇందులో భాగంగా గురువారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం ప్రారంభిస్తున్నామని, త్వరలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలుపుతూ, దీనివల్ల విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం లభిస్తుందని, దీని ఉపయోగించుకొని విద్యార్థులు మంచిగా చదువుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీమతి శ్రావణి రత్నాకర్ మాట్లాడుతూ ,నేటి బాలలే, రేపటి భావి భారత పౌరులని ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకాలు ఉపయోగించుకొని విద్యార్థులు వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ,ఇందుకు మేమందరం సహకరిస్తామని తెలిపారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటర్ బోర్డు కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఫుడ్ కమిటీ ఇన్చార్జి బండి ఈశ్వర్, సానిటరీ కమిటీ ఇన్చార్జి గుజ్జురు శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్పిఓ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేత్ర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గర్భిణులు,బాలింతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..





- 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు
- సంప్రదాయ పద్ధతిలో కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి
- శ్యాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా శ్రీమంత వేడుకలు..
- చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ సేవలందిస్తున్న తీరు అభినందనీయం..

ఖమ్మం/జిల్లా వైరా టౌన్ ఆగస్టు 13 (అక్షరం న్యూస్)

తల్లిపాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో భాగంగా గర్భిణులకు శ్రీమంత వేడుకలు కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ,గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.నేటి ఆధునిక కాలంలోనూ ఎలాంటి హంగు ఆర్భాటాలకు పోకుండా,మన సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఇలాంటి వేడుకలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.గర్భస్థ దశ నుంచే సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సర్వాజం సాధ్యమవుతుందని,తద్వారా భావి భారత పౌరులైన చిన్నారులు ధృఢంగా ఎదుగుతారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సంప్రదాయబద్ధంగా ఓడీ పోసి, అక్షితలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో



20 వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు తేజావత్ బాలమ్మ , కుసుమ, అంగన్వాడీ టీచర్ నిరోషా,

మహిళా సభ్యులు , ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభం

ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

వైరా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని హరే రామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో వైరా ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రారంభించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ స్థానిక నాలుగో వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రావణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణతో కలిసి అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం అందించారు. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ఆదిత్య అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- వయసుకు ఎత్తుకు అనుకూలంగా బరువు ఉండాలి.
- వ్యాయామం జీవితంలో ఒక భాగం చేసుకోవాలి నడక ద్వారానే ఆరోగ్యం
- ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ మహిపాల్

కరీంనగర్/ జమ్మికుంట/ ఆగస్టు 13 /అక్షరం న్యూస్ :

శరీరానికి అవసరమైనంత స్వచ్ఛమైన గాలిని పీల్చడం, తగినంత మంచినీరు తీసుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని ధర్మారం ఒకటో వార్డు కౌన్సిలర్ పోలు దివ్య--బిక్షపతి అన్నారు.బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జమ్మికుంట ఆదిత్య--అమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం జమ్మికుంట మండలం ధర్మారం గ్రామంలోని ఒకటో వార్డు పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్ మాట్లాడుతూ ఆరోగ్యానికి ఎంతో కీలకమైన గాలి, నీటి విషయంలో ప్రజలు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ బాడీ మాస్ ఇండెక్స్ (బి ఎం ఐ) ప్రకారం వయసు, ఎత్తుకు అనుగుణంగా శరీర బరువు ఉండాలని తెలిపారు. అయితే, చాలామంది ఈ ప్రమాణాలకు అనుగుణంగా బరువు ఉండటం లేదని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడంతో పాటు అధిక బరువు ఉన్నవారు బరువు తగ్గేందుకు, తక్కువ బరువు ఉన్నవారు ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. నడక, వ్యాయామాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి మాట్లాడుతూ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ రిఫైన్డ్ నూనెల వినియోగాన్ని తగ్గించాలని, వేపుళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలను తక్కువగా ఉడికించి తీసుకోవడం ద్వారా పోషక విలువలను కాపాడుకోవచ్చని తెలిపారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటిస్తే ప్రతి ఇల్లు ఒక ఆరోగ్యకేంద్రంగా మారుతుందని అన్నారు.ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందలేని నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే సామాజిక బాధ్యతతో బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు తమ ఆసుపత్రి వైద్య బృందం సంపూర్ణ సహకారం అందిస్తోందని ఆదిత్య--అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత ఎలుక దేవేందర్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రజలకు అందిస్తున్న ఈ వైద్య సేవలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ కే. సుమలత, రెండో వార్డు కౌన్సిలర్ పోల్నేని వేణుగోపాలరావు, ఆదిత్య--అమృత ఆసుపత్రి పీఆర్ఓలు రఫీక్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్ రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, సంతోషిని, సుచిత్రతో పాటు వార్డు సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 13: ఉపాధ్యాయులసమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుఎస్పిసి ఉపాధ్యాయదంసంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తహసీల్దార్ రాజేష్ రెడ్డికి గురువారం మెమోరాం డం సమర్పించారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ నాయకుడు ఆలేటి యాదవ రెడ్డి, డిటిఎఫ్ నాయకుడు దూడయ్య, కళింగరెడ్డి, మోహన్ రావు. రేణుక, సునంద, పద్మజ, విజయ రాణి, యాదయ్య, సంపత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో ఘనంగా కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుక చౌదరి జన్మదిన వేడుకలు

ఖమ్మం జిల్లా/వైరా టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

కేంద్ర మాజీమంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుక చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీమతి రేణుక చౌదరి జన్మదిన కేకును స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూతకాని జైపాల్, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు అనంతరం పార్టీ నాయకులకు కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు కేంద్ర మాజీ మంత్రిగా శ్రీమతి రేణుకా చౌదరి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని వారు భద్రాచల శ్రీరామచంద్రమూర్తి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో వారి జీవన ప్రయాణం కొనసాగాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు కొనియాడారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంపౌండ్ శేషగిరి, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రాముడు, ధర్నా. రాజశేఖర్ గుడిమల్ల రత్తయ్య, పినపాక మాజీ సర్పంచ్ పుల్ల రాజు గుత్తికొండ వీరబాబు, ఎస్డి అన్వర్ పాషా, యామాల భాస్కర్, బుడికి వెంకన్న, గుత్తికొండ నవీన్, ఎస్.కె మోషన్, రసూల్, తలారి సతీష్, అరికట్ల వినయ్, దగ్గుపాటి రవి, షేక్ రహీం, బండ్ల కృష్ణ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు



# మార్పు కోసమే ఈ చైతన్య యాత్రలు

- 158 బహిరంగ సభలు దిగ్విజయంగా పూర్తి.
- 460 గ్రామాలు, బస్తీల మీదుగా యాత్ర కొనసాగింది.
- కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొడతాం.
- ప్రజా చైతన్యంతోనే అసలైన మార్పు.
- అప్రజాస్వామిక పాలనపై రాజీలేని పోరాటం.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 13 / అక్షరం న్యూస్ -: సిపిఐ జాతీయ కమిటీ పిలుపుమేరకు 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో ఆగష్టు 6 నుంచి వారం రోజులపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం నుంచి అశ్వారావుపేట వరకు చేపట్టిన జన చైతన్య యాత్రలు జిల్లా వ్యాప్తంగా అత్యంత విజయవంతమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. గురువారం శేషగిరిభవన్'లో అయన మాట్లాడుతూ జిల్లాలోని 23 మండలాల పరిధిలో ఈ నెల 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఈ ప్రచార యాత్రలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయని ఆయన పేర్కొన్నారు. ఈ యాత్రల్లో భాగంగా వివిధ గ్రామాలు, మండల కేంద్రాలలో మొత్తం 158 బహిరంగ సభలను నిర్వహించామని, 460 గ్రామాలు, బస్తీల మీదుగా పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగాయని వెల్లడించారు. వందమంది పార్టీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు యాత్ర బృందంగా పాల్గొని జయప్రదం చేశారని తెలిపారు. ఈ యాత్రల ద్వారా సుమారు మూడు లక్షల మంది ప్రజలను నేరుగా కలసి యాత్ర యొక్క ముఖ్య ఉద్దేశాలను, ప్రజా సమస్యలపై పార్టీ పోరాట పంథాను వివరించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. దేశంలో పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం, రాజ్యాంగ బద్ధ సంస్థల నిర్వీర్యం వంటి చర్యలకు నిరసనగా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి, ప్రజల హక్కు సాధనకు నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. యాత్రల స్ఫూర్తితో సెప్టెంబర్ 1న ఢిల్లీ రాం లీలా మైదానంలో జరిగే జాతీయ స్థాయి ధర్నా, బహిరంగ సభకు తరలుతామని స్పష్టం చేశారు.

## ఘనంగా కంభంపాటి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైరా టౌన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కంభంపాటి సత్యనారాయణ జన్మదిన వేడుకలు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాలోత్ విగ్నేష్ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కంభంపాటి సత్యనారాయణ కి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ , మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు , వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి , వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు , గరిడేపల్లి వెంకటేశ్వర్లుగారు, ఏడుకొండలు ,ఆది ఆనందరావు , సయ్యద్ అన్వర్ పాషా , షేక్ అజీత్ పాషా , పానేం భాస్కర్ రావు , తోటకూర గోపి , తోటకూర వీరబాబు వేల్పుల రత్న భరత్ , కట్ల సాయి ,యర్రమల కోటేశ్వర్ రెడ్డి , ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది మాదాసు ఎల్లయ్య , దాసు ,షేక్ మహమూద్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కంభంపాటి సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## హర్ ఘర్ తీరంగ్ లో భాగంగా జాతీయ జెండాతో భారీ ర్యాలీ

- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్




కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 13/అక్షరం న్యూస్:

మన దేశం మన జెండా మన గర్వం హర్ ఘర్ తిరంగ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుండి భారీ జాతీయ జెండాతో ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ మన జాతీయ జెండా మన దేశ గౌరవానికి ప్రతీక తిరంగ మనలో దేశభక్తిని, ఐక్యతను, స్ఫూర్తిని నింపుతుంది ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి ప్రతి గుండెలో భారతమాతపై ప్రేమ వెల్లివిరియాలి ఇంటింటా తిరంగ గుండెగుండెలో దేశభక్తి దేశం కోసం దేశ ప్రజల కోసం మనమంతా ఒక్కటే జై హింద్ వందే మాతరం అని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్స్, వివిధ పార్టీ నాయకులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదో శతాబ్దం నాటి దాన శాసనం గుర్తింపు

- ముల్కనూరుకు వెయ్యేళ్లకు పైగా చారిత్రక ప్రాధాన్యం.. సంరక్షించాలని చరిత్రకారుల విజ్ఞప్తి



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 13/అక్షరం న్యూస్:-


హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో పదో శతాబ్దానికి చెందిన అరుదైన దాన శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుడికందుల కిషోర్, సిద్ధమల్ల రమేష్ అన్వేషణలో గుర్తించారు. గ్రామంలోని మహిళా సహకార డెయిరీ వెనుకభాగంలో ఉన్న చిన్న రాతిగుండుపై ఈ శాసనం చెక్కి ఉంది. శాసనం ఉన్న రాతిపై గణపతి, వేదిక భద్రపీఠంపై శివలింగం, పక్కన నంది, మహిషాసురమర్దిని అర్ధ (ఎంబోజ్డ్) శిల్పాలు చెక్కి ఉన్నాయి. వాటి పైభాగంలో సూర్యచంద్రుల ప్రతిమలు, వాటి పైన పెద్ద అక్షరాలతో శాసనం లిఖించబడింది.అయితే కాలక్రమంలో రాతిపై మనుషుల కార్యకలాపాల కారణంగా శాసనంలోని అక్షరాలు చాలా వరకు చెరిగిపోయాయి. భక్తి, విశ్వాసాల కారణంగా రాతిపై ఉన్న శిల్పాలు, శాసనం కొంతమేరకు పరిరక్షించబడినట్లు చరిత్ర బృందం సభ్యులు తెలిపారు. శాసనం ఉన్న రాతికి ఎదురుగా మొక్కుబడి నాగశిలలు కూడా ఉన్నాయి.

### ముల్కలూరు పేరుతో శాసన ప్రస్తావన..

పదో శతాబ్దానికి చెందిన తెలుగుకన్నడ లిపిలో కన్నడ భాషలో ఈ శాసనం ఉన్నట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. కళ్యాణి చాళుక్యుల పాలనా కాలానికి చెందిన ఈ శాసనంలో సమధిగత పంచ మహాశబ్ద ప్రశస్తిగల మహాసామంతుడు బిజ్జన సంవత్సరం వివరాలు పూర్తిగా తెలియకపోయినా చైత్ర శుద్ధ ద్వాదశి రోజున ముల్కలూరులో నీర్నేలను దానం చేసినట్లు అర్థమవుతోందని ఆయన వివరించారు.శాసనంలో ముల్కలూరు అనే గ్రామనామం ప్రస్తావన ఉండటం చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యమని హరగోపాల్ పేర్కొన్నారు. దీన్ని బట్టి ప్రస్తుత ముల్కనూరు గ్రామానికి ముల్కలూరు అనే పేరు పదో శతాబ్దానికి ముందే ఉన్నట్లు నిర్ధారించే ఆధారాలు లభించినట్లవుతుందని తెలిపారు. గ్రామ చరిత్రకు వెయ్యేళ్లకు పైగా పురాతన నేపథ్యం ఉందని ఈ శాసనం స్పష్టం చేస్తోందన్నారు.

### శాసనాన్ని పరిరక్షించాలి

ముల్కనూరులో గుర్తించిన ఈ చారిత్రక శాసనం శిల్పాలు చరిత్ర పరిశోధకులకు విలువైన ఆధారాలని హరగోపాల్ తెలిపారు. కాలగమనంలో శాసనంలోని అక్షరాలు మరింత చెరిగిపోకుండా సంబంధిత పురావస్తు శాఖ అధికారులు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. శాసనాన్ని శాస్త్రీయంగా పరిశీలించి. అందులోని పూర్తి వివరాలను వెలికితీస్తే ముల్కనూరు గ్రామ చరిత్రకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.



# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై వ్యక్తిగత విమర్శలు తగవు

- నువ్వు ఖమ్మం రెడ్డి వి అయితే మేం కరీంనగర్ కౌశిక్ రెడ్డి మనుషులం
- కమలాపూర్ సభను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదు
- -జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ దిలీప్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్



కరీంనగర్/జమ్మికుంట/ ఆగస్టు 13/అక్షర న్యూస్: కమలాపూర్‌లో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ దిలీప్కుమార్ , మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ లు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కమలాపూర్ సభలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందనే వాస్తవాన్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. అదేవిధంగా కమలాపూర్‌లో ఉప్పల్ మండలంగా ప్రకటించాలని ప్రజల తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ అంశాలను వక్రీకరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన రాజకీయ సంస్కృతి కాదన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని, రైతులు, యువత, మహిళలు, దళితులు, బీసీలు, అభివృద్ధి, సాగునీరు, నిధులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత ఆరోపణలు, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మద్దతుతో పనిచేస్తున్న నాయకులను వ్యక్తిగతంగా కించపరచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో అంతిమ తీర్పు ప్రజలదేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, హుందాతనం పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజా నాయకులపై అవమానకర వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజాస్వామ్యబద్ధంగా గట్టిగా స్పందిస్తాయని హెచ్చరించారు. రాజకీయ విభేదాలు ప్రజా సమస్యల పరిష్కారానికే పరిమితం కావాలని, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మదిలో ఉన్నాయని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ పోనగంటి రాము, ఫిరోజ్, బిఆర్ఎస్ నాయకులు మైస రవి, మంద రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో ఆరుతడి పంటలు సాగు చేయాలి

- ఏలినో ప్రభావంతో వరి సాగుకు దూరంగా ఉండాలి..
- ఆరుతడి పంటలతో రైతులకు అధిక ప్రయోజనం..
- మండల వ్యవసాయ అధికారి పద్మ..




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 13/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో గురువారం ఆరుతడి పంటల సాగు ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు.

ఏలినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని డాక్టర్ వీరన్న సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల కంది, పెసర, మినుము, బబ్బర్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎరువుల యాజమాన్యం చీడపీడల నివారణ నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ ఏలినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భ జలాలు పడిపోయే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం నీరు ఉందని వరి నాట్లు వేస్తే పంట చివరి దశ వరకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు. అందువల్ల రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలపై కూడా రైతులకు వివరించారు. సూడోమోనాస్ పీఎస్‌బీ, ట్రైకోడెర్మా విరిడే వంటి జీవ ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ప్రవంతి, ఏఈఓ మౌనికతో పాటు స్టూడెంట్స్, పలువురు రైతులు పాల్గొన్నారు

# ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ నుండి నీరు విడుదల

- రైతులు బాధ్యతగా నీటిని సద్వినియోగం చేసుకోవాలి
- అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి
- స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 13: రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని రైతుల పంటలను కాపాడడానికే ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తుందని స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఆశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాలువ నుండి 250 క్యూసెక్కులు, చీటకోడూరు రిజర్వాయరు వెళ్లే కాలువ నుండి 50 క్యూసెక్కుల నీటిని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధ లు, రైతులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాలువల నుండి. వెళ్లే నీరు ఎక్కడ వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకొని పంటలను కాపాడుకోవాలని రైతులను కోరారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కొత్తగా వరి సాగు చేయకుండా ఇప్పటికే వేసిన వరి నాట్లను, అరుతడి పంటలను కాపాడుకోవాలన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తి పోసి రిజర్వాయర్లను నింపడం జరిగిందని వెల్లడించారు. నియోజకవర్గం లోని ధర్మసాగర్, ఘన్పూర్, ఆశ్వరావుపల్లి, గండి రామారం, బొమ్మకూరు, నవాబుపేట రిజర్వాయర్లలో ప్రస్తుతం 50 శాతానికి పైగా నీటి నిలువలు ఉన్నాయని, వీటి ద్వారా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతులు కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో రఘునాథపల్లి మండల కేంద్రంలో రూ.100 కోట్ల వ్యయంతో 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం జరుగనుందని, దీంతో జనగామ జిల్లాలోని ఏడు మండలాలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుందని తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనులను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కోరారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనా రెండున్నర ఏళ్లలో ఆర్ అండ్ బి. పంచాయతీ రాజ్ హ్యామ్ రోడ్లతో పాటు అన్ని రకాల రోడ్ల అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. గత 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి ప్రజలను, అభివృద్ధిని ఏనాడు పట్టించుకోకుండా చిల్లర చిలిపి పనులతో నియోజకవర్గానికి చెడ్డ పేరు తెచ్చిన వారు కూడా ఈ రోజు చాలా మాటలు మాట్లాడుతున్నారని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే రాజయ్యపై మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మాసన్ పల్లి లింగాజి, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం నాయక్. ఈఈ ప్రవీణ్, డిఈ అరుణ్ జ్యోతి. ఎఈ సింధు, సర్పంచ్ పొన్నగంటి చైతన్య రాజు, గాదె మహేందర్ రెడ్డి, కోళ్ల రవి, కావటి భాస్కర్, బొనాసి క్రాంతి కుమార్, మేకల నరేందర్, పర్మ సిద్దేశ్, గొట్టం భాస్కర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ బాషా మియా, లోనే రవిందర్, గొంగళ్ల అబ్రహాం, నామాల బుచ్చయ్య, కుర్ర రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

- ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలి..
- ప్రతి హృదయంలో దేశభక్తి వెల్లివిరియాలి..
- డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి



ఖమ్మం జిల్లా/ఖమ్మం టౌన్ ఆగస్టు 13( అక్షం న్యూస్)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలో గురువారం నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీ దేశభక్తిని చాటింది. బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో యువత, విద్యార్థులు, పార్టీ శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు జాతీయ జెండాలను చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. బీజేపీ కర్ణాటక--తమిళనాడు రాష్ట్రాల జాతీయ సహ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ జిల్లా పరిషత్ సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీ సాగిన మార్గమంతా దేశభక్తి నినాదాలతో మార్మోగింది. జాతీయ ఐక్యత, దేశభక్తిని చాటడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల అపార త్యాగాలను స్మరించుకోవడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎటుచూసినా త్రివర్ణ పతాకాలే రెపరెపలాడాయి. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తిరంగా కేవలం ఒక జెండా మాత్రమే కాదని, కోట్లాది మంది భారతీయుల ఆత్మగౌరవానికి, దేశ సార్వభౌమత్వానికి సజీవ ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలకు త్రివర్ణ పతాకం ప్రతిరూపమని పేర్కొన్నారు. చారిత్రక ఖమ్మం గడ్డ స్వాతంత్ర్య పోరాటాలతో పాటు అనేక ప్రజా ఉద్యమాలకు నిలయమని సుధాకర్‌రెడ్డి గుర్తుచేశారు. మధిర తాలూకా ఎర్రుపాలెంలో జన్మించి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసి 'హైదరాబాద్ సర్దార్'గా కీర్తి గడించిన సర్దార్ జమలాపురం కేశవరావు సేవలను ప్రత్యేకంగా స్మరించుకున్నారు. ఆయనతో పాటు పొట్ల కృష్ణయ్య, అమర్లపూడి పురుషోత్తం, అయితం వెంకటేశ్వర్లు తదితర పోరాట యోధులకు నివాళులర్పించారు. చరిత్ర పుటల్లో పేర్లు నమోదుకాని ఎంతోమంది అజ్ఞాత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కూడా స్మరించుకుంటూ వారికి శిరస్సు వంచి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలను పణంగా పెట్టి సాధించిన స్వేచ్ఛా భారతంలో నేడు మనం సగర్వంగా త్రివర్ణ పతాకంతో నడుస్తున్నామని అన్నారు. వారి త్యాగాలు, దేశభక్తి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. యువతదే దేశ భవిష్యత్తుదేశ భవిష్యత్తు ముమ్మాటికీ యువత చేతుల్లోనే ఉందని సుధాకర్‌రెడ్డి అన్నారు. యువత తమ జీవితాల్లో 'దేశం అన్నిటికంటే ముందు' అనే భావనను బలంగా అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ అంటే సరిహద్దుల్లో సైనికులు కాపలా కాయడం మాత్రమే కాదని, విద్యార్థులు నిజాయితీగా చదవడం, పౌరులు బాధ్యతగా పనిచేయడం, అవినీతిని వ్యతిరేకించడం, పేదలకు అండగా నిలవడం కూడా నిజమైన దేశసేవేనని వివరించారు. భాషలు, ప్రాంతాలు, సంప్రదాయాలు వేర్వేరైనా త్రివర్ణ పతాకం కింద భారతీయులంతా ఒక్కటేనని అన్నారు. ఇదే 'ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా దేశ సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్న వీర జవాన్లకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా సెల్యూట్ చేశారు.

'స్వతంత్ర భారత్' నుంచి 'వికసిత భారత్' వైపు

నాడు స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేసి మనకు స్వతంత్ర భారతాన్ని అందించారని, నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత భారత్‌ను నిర్మించడం ప్రతి భారతీయుడి సమిష్టి బాధ్యత అని డా. పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంపైనే కాకుండా ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం ఎగరాలని ఆకాంక్షించారు. ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి అఖండ జ్యోతిలా వెలగాలని పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం కేవలం జెండా ఎగరవేయడానికి పరిమితం కాకుండా జాతీయ ఐక్యత, దేశభక్తి, బాధ్యతాయుత పౌరసత్వానికి ప్రతీకగా మారాలని అన్నారు. తిరంగా ర్యాలీ కన్వీనర్ వేల్పుల సుధాకర్ అధ్యక్షతన ర్యాలీ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు వాకదాని పుల్లారావు యాదవ్, నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గల్లా సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వరరావు, సన్నీ ఉదయ్‌ప్రతాప్, రుద్ర ప్రదీప్, గుత్తా వెంకటేశ్వర్లు,నాయుడు రాఘవరావు, నున్న రవికుమార్,విజయ రాజు ,శ్యామ్ రాథోడ్, శీలం పాపారావు, మందడం సుబ్బారావు, అల్లిక అంజయ్య, జిల్లా కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మంద సరస్వతి, వీరవెల్లి రాజేష్ ,ఆర్.వి.ఎస్. యాదవ్, నకిరకంటి వీరభద్రం, రీగన్ ప్రతాప్, రుద్రగాని మాధవ్, తదితరులతో పాటు పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చీకోడ్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఆగస్ట్ -13(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామం మీదుగా, ముచ్చర్ల లింగన్న పేట,మీదుగా కామారెడ్డి వరకు సిద్దిపేట నుండి బస్సు సౌకర్యం కల్పించాలని ముస్తాబాద్ మండల అంబేద్కర్ యువజన సంఘము అధ్యక్షులు కాంపల్లి శ్రీనివాస్ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందచేసారు. గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారుదీనిపై స్పందించిన మంత్రి త్వరలో నే ఆర్టీసీ బస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు



# హుజురాబాద్ లో ప్రజలు గెలిపిస్తే! హైదరాబాద్ లో పని చేస్తున్న ఎమ్మెల్యే

**• యూత్ కాంగ్రెస్ జమ్మికుంట అధ్యక్షులు - బుడిగె శ్రీకాంత్**



కరీంనగర్/ జమ్మికుంట/ఆగస్టు 13/ అక్షరం న్యూస్:

సోమవారం రోజున కమలాపూర్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వేదికపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రదర్శించిన తీరు, అది ఆయన పబ్లిసిటీ పిచ్చికి పరాకాష్ఠ అని జమ్మికుంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ; బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా అనుభవించిన కాలంలో హుజురాబాద్ పేదలకు ఒక్క ఇల్లైనా పంపిణీ చేసావా అంటూ దమ్ముంటే శ్వేత పత్రం విడుదల చేయాలంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు చొరవతో; కమలాపూర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గార్ల ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తుంటే, ఓర్వలేక కౌశిక్ రెడ్డి సభా వేదికపై రసాభాస చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా, దారుణంగా గాలికి వదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, మౌలిక వసతులు కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తుంటే. కౌశిక్ రెడ్డి మాత్రం హైదరాబాద్ నుండి వచ్చి ఇక్కడ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. హుజురాబాద్‌లో ప్రజలు గెలిపిస్తే.. గత మూడేళ్లుగా నియోజకవర్గాన్ని వదిలేసి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా! హైదరాబాద్‌లో వారి ముగ్గురు బాసుల చుట్టూ తిరుగుతూ గన్‌మెన్‌లా, పీఏలా, డ్రైవర్‌లా వెట్టిచాకిరీ చేస్తున్న ఈ ఎమ్మెల్యేకి, ఇక్కడి పేదల కష్టాల గురించి మాట్లాడే కనీస అర్హత లేదని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయి రియాలిటీని వదిలేసి సోషల్ మీడియాలో 'రీల్ స్టార్' వేషాలు వేసే ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వీధి కుక్క కంటే హీనంగా వ్యవహరిస్తూ హుజురాబాద్ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తన పార్టీ పెద్దల మెప్పు కోసం, పత్రికల్లో హెడ్‌లైన్స్ కోసం ప్రభుత్వ వేదికలపై గొడవలు సృష్టించడం కాదని, దమ్ముంటే హైదరాబాద్ గులాంగిరి వదిలి హుజురాబాద్ అభివృద్ధి కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఇలాంటి పూనరావృతం అయితే, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డిని అడుగడుగునా అడ్డుకుంటామని బుడిగె శ్రీకాంత్ హెచ్చరించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యంగా ముందుకు వెళ్తున్న నాయకుడు ప్రణవ్ బాబు

- రాజకీయంలో ఈ తరానికి క్లీన్ చిట్ నేతగా గుర్తింపు..
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి
- ప్రణవ్ జన్మదిన సందర్భంగా వాల్ పోస్టర్ ఆవిష్కరణ.



కరీంనగర్/జమ్మికుంట/ఆగస్టు 13/అక్షరం న్యూస్:

రాజకీయంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలో ప్రజాధారణ పొంది ఈ ప్రాంత ఆశాకిరణంగా భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా నిలుస్తున్న మంచి నాయకుడు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేశిని కోటి అన్నారు..ఈ నెల ఆగస్టు 15 ప్రణవ్ జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల కోసం పదవి లేకున్నా సేవ చేయడం కేవలం ప్రణవ్ బాబుకే సాధ్యమని,తాత వారసత్వాన్ని అందిపుచ్చుకొని తాతకి తగ్గ మనవడిగా రాజకీయంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాడని,భవిష్యత్ లో ఈ ప్రాంతం నుండి ప్రజలకు సేవ చేసే భాగ్యం,భగవంతుడు ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్టు ఆయన జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్ యూఐ,యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ నాయకులు బొడిగె శ్రీకాంత్, ఎండి సజ్జు, తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ కౌన్సిలర్ బొంగోని వీరన్న ,మర్రి రామ్ రెడ్డి, పంజాల అజయ్, మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, రామారావు, పెద్ది కుమార్, జిల్లెల్ల తిరుపతిరెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు చందా రాజు .కుదాడి తిరుపతి. మాచర్ల రాజు. ఒగ్గు రమేష్ . ఎగితసుజాత అశోక్ . పాతకాల మౌనిక అనిల్. యాట్లసునీత .అశోక్.,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు తోట స్వప్న, పిడుగు భాగ్యలక్ష్మి మాజీ కౌన్సిలర్ శ్రీహరి, వార్డ్ అధ్యక్షులు టెంకురాల కిషోర్ ఆడెపు దేవరాజ్ రాజేష్ రాజకుమార్ ఏం సి డైరెక్టర్ సూర్య రాజేశ్వరరావు తిరుపతి రెడ్డి దేవస్థాన డైరెక్టర్ చిరంజీవి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ..
- సీతారామ ప్రాజెక్టు పనులపై సుదీర్ఘ చర్చ..
- మూడో నుంచి నాలుగో పంప్ హౌస్ మధ్యలో 532 ఎకరాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి..
- జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..
- సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలి..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 13 (అక్షం న్యూస్)

సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం భేటీ అయ్యారు. సీతారామ ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారు

**రూ.45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి**

మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణ ప్రక్రియను రూ.45 కోట్లతో చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

**సంబంధిత పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల**

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములన్ని సస్యశ్యామలం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పైప్ లైన్ నిర్మాణం పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట మండలం లోని నాలుగో పంప్‌హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే నాలుగో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలను కాలువల ద్వారా అందించే ప్రతిపాదనలకు బదులుగా పైప్‌లైన్ ద్వారా నీటిని అందించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.

పైప్‌లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి, నిధులు విడుదల చేసి పనులను చేపడితే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు తమ భూములను కోల్పోవాల్సిన అవసరం ఉండదని మంత్రి తుమ్మల వివరించారు.

**జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం చేయండి**

జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని మంత్రి తుమ్మల కోరారు.

సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతుల పంటలను రక్షించేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి సాగునీటిని విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి, రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.

# మంత్రి తుమ్మల అరుదైన రికార్డు

- రాజకీయ చరిత్రలోనే అరుదైన ఘట్టం..
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 21సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జండా ఆవిష్కరణ..
- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం.
- 4 ప్రభుత్వాల సాక్షిగా ఒకే గౌరవం..
- ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 13( అక్షం న్యూస్)

హైదరాబాద్:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు.

ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా ఆయనకే దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం. అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.

**నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు..**

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, ప్రొహిబిషన్-ఎక్సైజ్, మేజర్-మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా**

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజాజీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది. వేర్వేరు రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**20 సార్లు జెండా ఆవిష్కరణ.. ఇప్పుడు 21వ సారి..**

1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున ఇప్పటివరకు 20 సార్లు తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 15న 21వసారి ఈ గౌరవం దక్కడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది.

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు, తన సొంత ప్రాంతానికి ఆనుకుని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ బాధ్యత దక్కడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం...**

పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధిగా తన స్థానాన్ని పదిలంగా నిలుపుకుంటూ వస్తున్న తుమ్మల నాగేశ్వరరావు రికార్డు, ఉమ్మడి రాష్ట్ర రాజకీయ చరిత్రలో అరుదైనదిగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. నలుగురు ముఖ్యమంత్రుల పాలనా కాలాల్లో ప్రభుత్వం తరఫున జాతీయ పతాకావిష్కరణ చేసిన అనుభవం చాలా తక్కువ మంది నేతలకు మాత్రమే దక్కుతుంది. ఈ కోణంలో చూస్తే, తుమ్మల నాగేశ్వరరావుది నిరాటంకమైన, స్థిరమైన రాజకీయ జీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**ఇప్పటివరకు తుమ్మల జాతీయ పతాకావిష్కరణ చేసిన సంవత్సరాలు**

1985, 1986, 1987, 1988, 1989, 1995, 1996, 1997, 1998, 1999, 2000, 2001, 2002, 2003, 2015, 2016, 2017, 2018, 2024, 2025

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609